

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 26-05-2026 | సంపుటి - 27 | సంచిక -364 | రూ : 4 | పేజీలు : 8


# మహిళా సూపర్ బజార్లు

- తొలి దశలో 119 ఏర్పాటుకు స్థలాలు కేటాయిస్తాం
- స్వయం సహాయక సంఘాలకు రైస్ మిల్లులు, లాజిస్టిక్స్ హబ్‌లు, గోదాముల నిర్మాణ బాధ్యత
- వారికి నామమాత్రపు లీజుతో వంద ఎకరాల వరకైనా అప్పగిస్తాం
- అతివల అండతో మళ్లీ అధికారంలోకి వస్తాం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- 8,000 గ్రామ మహిళా సంఘాల భవనాలకు వర్చువల్‌గా శంకుస్థాపన

2లో



## ట్యాక్స్ తగ్గిస్తే

# రూ.1 లక్ష కోట్ల నష్టం



- పన్నులు తగ్గిస్తే లక్ష కోట్ల నష్టమన్న నిర్మల
- '3ఎఫ్' అంశాలపై కేంద్రం ప్రత్యేక నిఘా
- దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందన్న మంత్రి
- భయాందోళనలు సృష్టించొద్దంటూ రాహుల్ గాంధీకి పరోక్ష కౌంటర్

2లో

## మెట్రోకు...

# భారీ ఊరట



2లో

- పాత అప్పులకు ఐఆర్‌ఎఫ్‌సీ ద్వారా రూ.13,527 కోట్ల రీఫైనాన్సింగ్
- దిల్లీలో కుదిరిన త్రైపాక్షిక ఒప్పందం
- తగ్గనున్న వడ్డీ భారం

దిల్లీ, హైదరాబాద్: హైదరాబాద్ మెట్రో రైలు మొదటి దశ ప్రాజెక్టుకు రుణ వడ్డీ భారం నుంచి భారీ ఊరట లభించింది. తక్కువ వడ్డీకి రీఫైనాన్సింగ్ చేసేందుకు ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్‌ఎఫ్‌సీ).. ఎల్‌అండ్‌టీ మెట్రో రైలు (హైదరాబాద్) లిమిటెడ్ మధ్య రూ.13,527 కోట్ల భారీ టర్మ్ లోన్ ఒప్పందం కుదిరింది. దిల్లీలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఐఆర్‌ఎఫ్‌సీ సీఎండీ, సీఈవో మనోజ్‌కుమార్ దూబే, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు

తరువాయి 2లో



## ధాన్యం కొనుగోలుకు

# కేంద్రం సహకరించడం లేదు

- అయినా రైతులకు ఇబ్బంది లేకుండా మేమే కొంటున్నాం
- సీపీఐ, సీపీఎం నాయకులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: ధాన్యం సేకరణలో కేంద్ర ప్రభుత్వం సహకరించడం లేదని, అయినా రైతులకు ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. మొక్కజొన్నలను కూడా కేంద్రం కొనుగోలు చేయడం లేదన్నారు. ప్రభుత్వానికి నష్టం వచ్చినా మద్దతు ధర చెల్లించి మొక్కజొన్న కొనుగోలు చేస్తున్నామని వివరించారు. సోమవారం సచివాలయంలో సీఎంతో సీపీఐ, సీపీఎం నేతలు సమావేశమయ్యారు. కనీస వేతనాల సవరణ చట్టం తీసుకురావడంపై ముఖ్యమంత్రికి వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'కేంద్రం మద్దతు ధరలు ప్రకటించి పండిన పంటలో 30% కూడా సేకరించడం లేదు. పంట కొనుగోలుపై కేంద్రాన్ని ప్రశ్నించాలి. కొనుగోళ్లపై నిరంతరం సమీక్ష నిర్వహిస్తున్నా. బెంగాల్ ఎన్నికల వల్ల కొంత హమాలీల కొరత ఏర్పడింది. ఎండల తీవ్రత వల్ల కూడా మధ్యాహ్నం సమయంలో సేకరణ జరగడం లేదు. మూసీ నిర్వాసితులకు స్థానికంగానే నివాసాలు మంజూరు చేస్తాం. మూసీపై భారాస, భాజపా రాజకీయం చేస్తున్నాయి. మూసీని అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతాం.

తరువాయి 2లో

## చైనా కొత్త ఎగుమతి ఆంక్షలు

# భారత్ 120 బిలియన్ డాలర్ల ఎలక్ట్రానిక్స్

- చైనా కొత్త ఎగుమతి ఆంక్షలతో భారత్‌కు ముప్పు
- ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ రంగాలపై తీవ్ర ప్రభావం
- 2026 నాటికి 120 బిలియన్ డాలర్ల ఎగుమతులే లక్ష్యం
- చైనాపై ఆధారపడటం తగ్గించేలా కేంద్రం వ్యూహాలు

2లో






## వాత తప్పదా?..

# మరో రూ.20 పెరగనున్న లీటర్ పెట్రోల్?

- ఇప్పటి వరకు రూ.7.38 పెరిగిన పెట్రో ధరలు
- పెంపు ఇంతటితో ఆగదని నిపుణుల అంచనా
- పశ్చిమాసియా యుద్ధంతో కంపెనీలకు భారీ నష్టాలు
- అవి తీరే వరకు పెంపు తప్పదని అంచనా

2లో

## నేరస్తులకు

# కఠిన శిక్షలు పడాలి

- మహిళలు, చిన్నారులపై నేరాల్లో కఠినంగా వ్యవహరించాలన్న సీఎం విజయ్
- తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసులను వెంటనే నమోదు చేయాలని ఆదేశం
- దర్యాప్తు వేగవంతం చేసి, నిందితులకు కఠిన శిక్షలు పడేలా చూడాలన్న సీఎం

2లో



## క్యూలైన్లలో

# నిరీక్షణకు చెక్

- శ్రీవారి భక్తులకు 'రీ-ఎంట్రీ' సదుపాయం
- వేసవి రద్దీలో సామాన్యులకు ఊరట
- సర్వదర్శనం టోకెన్ ఉన్నవారికి అవకాశం

2లో



# మహిళా సూపర్ బజార్లు

హైదరాబాద్: స్వయం సహాయక సంఘాలతో రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేట్ తరహాలో మహిళా శక్తి సూపర్ బజార్‌లను ఏర్పాటు చేయిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. మొదటి దశలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున 119 సూపర్ బజార్‌లకు నామమాత్రపు లీజుపై స్థలాలను కేటాయిస్తామన్నారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలోనే రైస్‌మిల్లులు, లాజిస్టిక్స్ హబ్‌లు, గోదాముల నిర్మాణం చేయిస్తామన్నారు. ఇందుకోసం ప్రభుత్వ భూములను కేటాయిస్తామని, సున్నా వడ్డీతో బ్యాంకు రుణాలను మంజూరు చేయిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 8,000 మహిళా సంఘాల భవనాలకు సోమవారం సచివాలయం నుంచి సీఎం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. అనంతరం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలో ఇకపై రైస్ మిల్లుల గోడౌన్లలో ధాన్యం నిల్వలు పెట్టబోమని, మహిళా సంఘాలే వడ్లు కొనుగోలు చేసి ప్రభుత్వానికి బియ్యం ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేస్తామని పునరుద్ఘాటించారు. సీఎం ఇంకా ఏమన్నారంటే...

**ఇది దేశంలోనే సంచలనం...**

''మహిళలు స్వశక్తితో నిర్వహిస్తున్న వ్యాపారాలను వారి సొంత భవనాల నుంచే కొనసాగించేందుకు 8,000 భవనాలను ఒకే రోజు, ఒకే సమయంలో ప్రారంభించుకునే అద్భుత కార్యక్రమమిది. ఇది దేశంలోనే సంచలనం. మహిళా సంఘాలకు సొంత భవనాలు ఉండటం అంటే సమావేశాలకు స్థలం ఇవ్వడం మాత్రమే కాదు. వారి ఆర్థిక కార్యకలాపాలకు, శిక్షణకు, వ్యాపార ప్రణాళికలకు శాశ్వత వేదికను సమకూర్చడం. తెలంగాణ ఆడబిడ్డల ఆశీర్వాదంతో ఏర్పడిన ప్రజాప్రభుత్వం మహిళా శక్తిని దేశానికి ఆదర్శంగా నిలపాలన్న సంకల్పంతో ముందుకుసాగుతోంది. అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించాం. ఉచిత ప్రయాణంతో నష్టం జరుగుతోందని ఆటోల, రిక్షాల కార్మికులను రెచ్చగొట్టి కొన్ని కార్యక్రమాలు చేయించారు. ఎవరెన్ని కుట్రలు చేసినా తిప్పికొట్టి బస్సులో ఉచిత ప్రయాణ పథకాన్ని కొనసాగించాం. ఈ మహాలక్ష్మి పథకం కోసం ఆర్టీసీకి ఉప ముఖ్యమంత్రి భట్టి... 29 నెలల్లోనే రూ.10 వేల కోట్లకుపైగా చెల్లించారు. బస్సులకు మహిళల్నే యజమానులను చేయాలనే లక్ష్యంతో 1,000 బస్సులను సంఘాలతో కొనుగోలు చేయించి... ఆర్టీసీకి అద్దెకు ఇప్పించాం. ఒక్కో బస్సుకు వారికి ప్రతినెలా రూ.70 వేల అద్దె వస్తోంది. కొత్తగా 553 బస్సులను వచ్చే నెల 5న ప్రారంభిస్తాం.

**అంబానీ, అదానీలతో పోటీగా...**

వ్యాపార దక్షలో మా ఆడబిడ్డలు అదానీ, అంబానీలతో పోటీ పడాలనే ఆలోచనతో వేయి మెగావాట్ల సౌరవిద్యుత్ ప్రాజెక్టులను వారికి కేటాయించాం. జిల్లా కేంద్రాలు, ముఖ్యమైన ప్రాంతాల్లో మహిళలతో బంక్‌లను ఏర్పాటు చేయిస్తున్నాం. ఇప్పటికే ప్రారంభమైన బంక్‌ల ద్వారా వారు నెలకు రూ.45 లక్షల వరకు ఆర్జిస్తున్నారు. ప్రజా ప్రభుత్వం మహిళా సంఘాలకు రూ.60,472 కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు అందించింది. వడ్డీ లేని రుణాలకు రూ.1,390 కోట్లను చెల్లించింది. తీసుకున్న ప్రతి రూపాయిని నిక్కచ్చిగా చెల్లిస్తున్న మహిళలకు మరింత చేయూతనిచ్చేందుకు రూ.5 లక్షల వరకున్న రుణాలను రూ.10 లక్షలకు పెంచుతున్నాం.

**పెద్ద వ్యాపారాల్లోకి ఆడబిడ్డలు**

మహిళా సంఘాలు ఇకపై పెద్ద వ్యాపారాల్లోకి రావాలి. వారు రైస్ మిల్లులు, మండల స్థాయిలో గోదాములు, లాజిస్టిక్స్ పార్కులు నిర్మించుకోవాలి. వాటికి అవసరమైన చోట 20, 30 ఎకరాలు... అవసరమైతే 100 ఎకరాల వరకు భూములతోపాటు బ్యాంక్ రుణాలను ఇప్పించే బాధ్యత తీసుకుంటా. ధాన్యం కొనుగోలు, నిల్వ, మిల్లింగ్ వ్యవస్థలో మహిళా సంఘాల పాత్ర పెరగాలి. ప్రస్తుతం కొందరు దళారులు, మరికొందరు మిల్లర్లు ప్రభుత్వాలను మోసం చేస్తున్నారు. మనం వడ్లు ఇస్తే అమ్మేసుకుని అసలును వెనక్కి చెల్లించడం లేదు. ప్రభుత్వానికి రూ.వేల కోట్ల నష్టం వస్తోంది. భవిష్యత్తులో ఏ మిల్లులోనూ మన బియ్యం, వడ్లను స్టాక్ పెట్టేదే లేదు. ఆడబిడ్డలకిస్తే ప్రతి గింజకూ జవాబుదారీగా ఉంటారు. మహిళా సంఘాలే వడ్లుకొని ప్రభుత్వానికి బియ్యం ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం. వారి చేతుల్లోకి ఈ వ్యవస్థ వెళ్తే పారదర్శకత, బాధ్యత పెరుగుతుంది.

**కార్పొరేట్ తరహా సూపర్ బజార్లు...**

మహిళా సంఘాల ఆధ్వర్యంలో కార్పొరేట్ తరహాలో మహిళా శక్తి సూపర్ బజార్లు నెలకొల్పాలి. అవి దేశంలోనే ఉత్తమమైనవిగా ఉండాలి. నాణ్యమైన వస్తువులు ప్రజలకు అందుబాటులోకి రావాలని, రైతుల ఉత్పత్తులకు మార్కెట్ దొరకాలని, తద్వారా మహిళాసంఘాలకు ఆదాయం రావాలన్నదే ఈ ఆలోచన వెనుకున్న లక్ష్యం. ప్రభుత్వం కూడా మహిళాశక్తి సూపర్ బజార్లలో వాటాదారుగా ఉంటుంది. పట్టణాల్లో వీటి ఏర్పాటుకు తక్కువధరకు స్థలాలు లీజుకిచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

**మళ్లీ అధికారంలోకి తెచ్చే శక్తి ఉంది**

మహిళా వారోత్సవాల్లో భాగంగా పట్టణాల్లోని మహిళలకు ఉచితంగా చిలకపచ్చరంగు చీరలను పంపిణీ చేస్తాం. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన చీరలు పొలాల్లో పిట్టలను కొట్టడానికి వాడారు. ప్రజాప్రభుత్వం ఆడబిడ్డకు సారెలాగా ఇందిరమ్మ చీరలను అందజేసింది. మా ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చే శక్తి మహిళలకు ఉంది. వారు ఆర్థికంగా బలంగా ఉంటే కుటుంబం .. తద్వారా గ్రామం బలపడుతుంది. రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది'' అని సీఎం అన్నారు.

# ధాన్యం కొనుగోలుకు కేంద్రం సహకరించడం లేదు

హైదరాబాద్: ధాన్యం సేకరణలో కేంద్ర ప్రభుత్వం సహకరించడం లేదని, అయినా రైతులకు ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. మొక్కజొన్నలను కూడా కేంద్రం కొనుగోలు చేయడం లేదన్నారు. ప్రభుత్వానికి నష్టం వచ్చినా మద్దతు ధర చెల్లించి మొక్కజొన్న కొనుగోలు చేస్తున్నామని వివరించారు. సోమవారం సచివాలయంలో సీఎంతో సీపీఐ, సీపీఎం నేతలు సమావేశమయ్యారు. కనీస వేతనాల సవరణ చట్టం తీసుకురావడంపై ముఖ్యమంత్రికి వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'కేంద్రం మద్దతు ధరలు ప్రకటించి పండిన పంటలో 30% కూడా సేకరించడం లేదు. పంట కొనుగోలుపై కేంద్రాన్ని ప్రశ్నించాలి. కొనుగోళ్లపై నిరంతరం సమీక్ష నిర్వహిస్తున్నా. బెంగాల్ ఎన్నికల వల్ల కొంత హమాలీల కొరత ఏర్పడింది. ఎండల తీవ్రత వల్ల కూడా మధ్యాహ్నం సమయంలో సేకరణ జరగడం లేదు. మూసీ నిర్వాసితులకు స్థానికంగానే నివాసాలు మంజూరు చేస్తాం. మూసీపై భారాస, భాజపా రాజకీయం చేస్తున్నాయి.

* **సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు**

మూసీని అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతాం. ప్రభుత్వ విద్యను ప్రక్షాళన చేస్తున్నా. పిల్లలకు నాణ్యమైన విద్య, ఆహారం అందించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నాం. ఆరుట్ల పాఠశాలను ఒకసారి సందర్శించండి' అని సీఎం సూచించారు. ఈ సమావేశంలో సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో ఆ పార్టీ ఎమ్మెల్సీ సత్యం, నాయకులు చాడ వెంకట్‌రెడ్డి, పశ్య పద్మ, ఈ.నరసింహ, బాగం హేమంతరావు, శంకర్, బాలనరసింహ, వీఎస్ బోసు తదితరులు హాజరు కాగా.. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ నేతృత్వంలో ఆ పార్టీ నేతలు జూలకంటి రంగారెడ్డి, పి.సుదర్శన్, జ్యోతి, నున్నా నాగేశ్వరరావు, మల్లు లక్ష్మి, సామినేని స్వరాజ్యం, ఎం.గోపాలరావు తదితరులు హాజరయ్యారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి కూడా పాల్గొన్నారు. సీపీఎం నాయకుడు సామినేని రామారావు హత్య కేసులో నిందితులను తక్షణమే అరెస్టు చేసి, చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పార్టీ తరఫున సీఎంకు వినతిపత్రాన్ని అందజేశారు. వేతనాల సవరణను పునఃపరిశీలించాలని, రెండెకరాలు పైబడిన రైతులకు రైతుభరోసా నిధులను విడుదల చేయాలని, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను లాటరీ ద్వారా ఎంపిక చేయాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని సీపీఐ నాయకులు కోరారు.

# మెట్రోకు భారీ ఊరట

ఢిల్లీ, హైదరాబాద్: హైదరాబాద్ మెట్రో రైలు మొదటి దశ ప్రాజెక్టుకు రుణ వడ్డీ భారం నుంచి భారీ ఊరట లభించింది. తక్కువ వడ్డీకి రీఫైనాన్సింగ్ చేసేందుకు ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్‌ఎఫ్‌సీ).. ఎల్‌అండ్‌టీ మెట్రో రైలు(హైదరాబాద్) లిమిటెడ్ మధ్య రూ.13,527 కోట్ల భారీ టర్మ్ లోన్ ఒప్పందం కుదిరింది. దిల్లీలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఐఆర్‌ఎఫ్‌సీ సీఎండీ, సీఈవో మనోజ్‌కుమార్ దూబే, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సమక్షంలో ఐఆర్‌ఎఫ్‌సీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునీల్‌కుమార్ గోయల్, హైదరాబాద్ మెట్రోరైలు లిమిటెడ్(హెచ్‌ఎంఆర్‌ఎల్) ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, ఎల్‌అండ్‌టీ మెట్రో రైలు(హైదరాబాద్) లిమిటెడ్ ఎండీ కేవీబీ రెడ్డి త్రైపాక్షిక ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. తెలంగాణ ప్రభుత్వ హామీతో 20 ఏళ్ల కాలవ్యవధికి కుదిరిన రుణ ఒప్పందమిది. ఐఆర్‌ఎఫ్‌సీ నుంచి తీసుకున్న రుణాన్ని త్రైమాసిక వాయిదాల్లో చెల్లించాల్సి ఉంటుంది. ఎలాంటి ప్రాసెసింగ్, ఇతర ఛార్జీలు ఉండవు.

**వడ్డీ భారం నుంచి విముక్తి..**

హైదరాబాద్ మెట్రో మొదటి దశను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం(పీపీపీ)లో నిర్మించారు. ఎల్‌అండ్‌టీ మెట్రోరైలు(హైదరాబాద్) లిమిటెడ్.. మెట్రోను నిర్మించి.. నిర్వహించింది. నిర్మాణం కోసం మూలధన పెట్టుబడి(ఈక్విటీ)తో పాటు బ్యాంకుల కన్సార్టియం నుంచి భారీ ఎత్తున రుణాలు తీసుకుంది. ఈ రుణాలకు ఎల్‌అండ్‌టీ హామీ ఇచ్చింది. అయితే, మెట్రో రైలు రెండో దశ విస్తరణకు ఆటంకాలు తొలగించేందుకు రూ.15 వేల కోట్లకు మొదటి దశ ప్రాజెక్టులో వంద శాతం వాటా కొనుగోలుకు రాష్ట్ర సర్కారు గత ఏడాది నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గత నెల 29న ఎల్‌అండ్‌టీతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. దీంతో ప్రాజెక్టు సర్కారు పరమైంది. ఒప్పందం ప్రకారం ఈక్విటీ రూ.1461.57 కోట్లను తెలంగాణ ప్రభుత్వం ఎల్‌అండ్‌టీకి చెల్లిస్తుంది. రుణాలు సర్కారుకు బదిలీ అయ్యాయి. అయితే, ఈ పాత రుణాల వడ్డీ రేట్లు గరిష్ఠంగా 9.5 శాతం వరకు ఉన్నాయి. వడ్డీ భారం తగ్గించుకునేందుకు ఐఆర్‌ఎఫ్‌సీ నుంచి వార్షికంగా 3.5 శాతం వడ్డీకి రుణం తీసుకునేందుకు తాజా ఒప్పందం దోహదం చేస్తుంది. గతంలో తీసుకున్న రుణాలు.. నాన్ కన్వర్టబుల్ డిబెంచర్లు(ఎన్‌సీడీ), కమర్షియల్ పేపర్లు, ఇతర టర్మ్ రుణాలను ఐఆర్‌ఎఫ్‌సీ ఇచ్చే రుణంతో తీర్చేయడానికి ప్రస్తుత ఒప్పందం వీలు కల్పిస్తుంది. పాత రుణాల సాఫీ చెల్లింపుతో.. ప్రాజెక్టు దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వం పెరగనుంది.

**మెట్రోకు ఆర్థిక ఉపశమనమిది..**

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో సమర్థ, సుస్థిర ప్రజారవాణా వ్యవస్థను అభివృద్ధి చేయడానికి కట్టుబడి ఉందన్నారు. హైదరాబాద్ అభివృద్ధికి అనుగుణంగా మెట్రో విస్తరణ అత్యంత ఆవశ్యకమని తెలిపారు. ట్రాఫిక్ రద్దీ తగ్గించడంతోపాటు జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో మెట్రో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. పాత రుణాల రీఫైనాన్సింగ్ ద్వారా హైదరాబాద్ మెట్రో రైలు మొదటి దశ ప్రాజెక్టుకు గణనీయమైన ఆర్థిక ఉపశమనం లభిస్తుందని చెప్పారు. ఈ ప్రక్రియను విజయవంతంగాపూర్తిచేయడంలోసహకరించిన కేంద్ర ప్రభుత్వం, ఐఆర్‌ఎఫ్‌సీ, ఎల్‌అండ్‌టీ, హెచ్‌ఎంఆర్‌ఎల్, సంబంధిత అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# చైనా కొత్త ఎగుమతి ఆంక్షలు

ఢిల్లీ : కరోనా మహమ్మారి తర్వాత చైనాకు ప్రత్యామ్నాయంగా, ప్రపంచానికి ఒక సరికొత్త గ్లోబల్ తయారీ కేంద్రంగా ఎదగాలని భారత్ గట్టిగా ప్రయత్నిస్తూ వస్తోంది. అందుకు అనుగుణంగా పరిశ్రమలు సిద్ధమవుతున్న తరుణంలో చైనా తన సరఫరా గొలుసుపై (సప్లై చైన్) పట్టును మరింత బిగించింది. ఆ దేశం తాజాగా తీసుకొచ్చిన కొత్త ఎగుమతి నిబంధనల వల్ల భారత్‌లో ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ రంగాలు భారీ కుదుపునకు లోనయ్యే అవకాశాలు ఉన్నాయి.

**'డిక్రీ 834, 835' అస్త్రం**

చైనా ప్రభుత్వం 'స్టేట్ కౌన్సిల్ డిక్రీ 834, 835' పేరుతో కొత్త నిబంధనలను అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం ఆధునిక సాంకేతికత, కీలక యంత్రాలు, ఖనిజాల ఎగుమతులపై చైనా ఆంక్షలు విధించింది. తమ ఫ్యాక్టరీలను వేరే దేశాలకు తరలించే కంపెనీలు లేదా అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా ఈ కొత్త రూల్స్ ఉన్నాయి. భారత్‌లోని ఎలక్ట్రానిక్స్ రంగం ఇప్పటికీ చైనా యంత్రాలు, ముడి సరకులపైనే ఎక్కువగా ఆధారపడటం వల్ల మన కంపెనీల్లో ఇప్పుడు తీవ్ర ఆందోళన మొదలైంది.

**ఎలక్ట్రానిక్స్ కలలకు బ్రేక్ పడేనా?**

భారతదేశ ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 2015లో 8.6 బిలియన్ డాలర్ల నుంచి 2025 నాటికి 47 బిలియన్ డాలర్ల రికార్డు స్థాయికి చేరాయి. ఈ 2026 చివరి నాటికి దీన్ని ఏకంగా 120 బిలియన్ డాలర్లకు చేర్చాలని కేంద్ర ఐటీ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. అయితే యాపిల్ సప్లయర్స్ విస్తరణ, సెమీకండక్టర్ ప్లాంట్ల వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులకు కావలసిన కీలక విడిభాగాలను చైనా అడ్డుకుంటే ఈ లక్ష్యం నెరవేరడం కష్టంగా మారుతుంది. కార్ల తయారీ రంగంలో కూడా దాదాపు 26 శాతం హైవాల్యూ ఎలక్ట్రానిక్స్ విడిభాగాలు చైనా నుంచే వస్తున్నాయి.

**కేంద్ర ప్రభుత్వం ఏం చేస్తోంది?**

చైనా చర్యలపై కేంద్ర రక్షణ, వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ స్పందించారు. చైనా లాంటి కొన్ని నిర్దిష్ట దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించడానికి రంగాల వారీగా పెట్టుబడి ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అలాగే తయారీ రంగాన్ని బలోపేతం చేయడానికి రూ.33,660 కోట్లతో 'భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన' కింద రాబోయే మూడేళ్లలో 50 ఇండస్ట్రియల్ పార్కులను ప్రారంభించాలని కేంద్రం ప్లాన్ చేస్తోంది.

# వాత తప్పదా?..

## మరో రూ.20 పెరగనున్న లీటర్ పెట్రోల్?

ఢిల్లీ : ఇంధన ధరలు ఇప్పటికే నాలుగు సార్లు పెరిగాయి. లీటరుపై దాదాపు రూ.7.38 వరకు భారం పడింది. ఈ పెంపు ఇంతటితో ఆగదని సమాచారం. చమురు సంస్థల నష్టాల నేపథ్యంలో ధరలు మరింత పెంచక తప్పదని ఆర్థిక నిపుణులు అంటున్నారు.

**తీరని నష్టాలు**

ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం లాంటి ప్రభుత్వ రంగ సంస్థల నష్టాలు తాజా పెంపుతో పూర్తిగా భర్తీ కాలేదు. అంతర్జాతీయ మార్కెట్ ధరలకు, మన రిటైల్ ధరలకు ఉన్న వ్యత్యాసాన్ని భర్తీ చేయాలంటే లీటరుపై మరో రూ.20 నుంచి రూ.33 వరకు పెంచాల్సి ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే అంత భారం ఒకేసారి వేయడం సాధ్యం కాకపోయినా విడతల వారీగా బాదుడు తప్పకపోవచ్చు.

**రూ.1.2 లక్షల కోట్ల భారం**

ఫిబ్రవరి 28 నుంచి ఇరాన్ వివాదం వల్ల అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు భారీగా పెరిగాయి. కానీ మనదేశంలో ఐదు రాష్ట్రాల ఎన్నికల కారణంగా వరుసగా 74 రోజుల పాటు ఇంధన ధరలను పెంచకుండా నిలిపివేశారు. భారత్ తన అవసరాల కోసం 88 శాతం ముడిచమురును దిగుమతి చేసుకుంటుంది. ధరలు స్థిరంగా ఉంచడం వల్ల ఈ మూడు ప్రభుత్వ రంగ సంస్థలపై ఏకంగా రూ.1.2 లక్షల కోట్లకు పైగా అదనపు భారం పడింది.

**క్రూడాయిల్ తగ్గినా**

ఇరాన్, అమెరికా మధ్య చర్చలు సఫలమైతే అది మన చమురు సంస్థలకు ఊరటనిస్తుంది. అయినా రవాణా ఖర్చులు, పాత నష్టాల వల్ల ధరల భారం వెంటనే తగ్గే అవకాశం లేదు. ఇటు ప్రజలపై ద్రవ్యోల్బణ భారం పడకుండా అటు చమురు సంస్థలు నష్టపోకుండా చూడటం ఇప్పుడు ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారింది.

# ట్యాక్స్ తగ్గిస్తే రూ.1 లక్ష కోట్ల నష్టం: నిర్మలా సీతారామన్

ఢిల్లీ : దేశంలో ఇంధన ధరలు మరోసారి పెరగడంపై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం స్పందించారు. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను తగ్గిస్తే ప్రభుత్వం దాదాపు రూ.లక్ష కోట్ల ఆదాయం నష్టపోతుందని వెల్లడించారు. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా అంతర్జాతీయంగా సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా ఉందన్నారు. కొందరు పనిగట్టుకొని ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని, అలాంటి వాటికి తావులేదని స్పష్టం చేశారు.

**రాహుల్‌కు పరోక్ష కౌంటర్**

స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్ఐడీబీఐ) 37వ వార్షికోత్సవంలో మాట్లాడిన మంత్రి ప్రభుత్వంపై వస్తున్న విమర్శలను తిప్పికొట్టారు. పశ్చిమాసియా సంక్షోభం ఉన్నప్పటికీ దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా ఉందని స్పష్టం చేశారు. కానీ కొంతమంది అంతా మునిగిపోతోందనేలా భయాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. పరోక్షంగా రాహుల్ గాంధీని ఉద్దేశించి ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఆయన దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభం ఎదుర్కోబోతోందని హెచ్చరించిన విషయం తెలిసిందే.

**'3-ఎఫ్' ఫార్ములా**

పశ్చిమాసియా సంక్షోభం మొదలై మూడు నెలలు కావస్తున్న తరుణంలో ప్రభుత్వం '3 ఎఫ్' (ఫ్యూయల్, ఫెర్టిలైజర్, ఫారెక్స్ ఇంధనం, ఎరువులు, విదేశీ మారకం)పై ప్రత్యేక దృష్టి సారించిందని నిర్మలా సీతారామన్ తెలిపారు. అంతర్జాతీయ ఒత్తిళ్ల వల్ల ఎరువుల ధరలు ఊహించని స్థాయికి చేరాయని, బంగారం ధరలు పెరగడం కూడా సవాలుగా మారిందని చెప్పారు. బయటి సంక్షోభాలను తట్టుకునేలా మోదీ నేతృత్వంలో వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు వివరించారు.

# నేరస్తులకు కఠిన శిక్షలు పడాలి: సీఎం విజయ్

తీవ్రమైన నేరాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపాలని, ముఖ్యంగా మహిళలు, చిన్నారుల విషయంలో కేసులను తక్షణమే నమోదు చేసి, దర్యాప్తును వేగవంతం చేయాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఎస్. జోసెఫ్ విజయ్ పోలీసు అధికారులను ఆదేశించారు. నిందితులకు కఠిన శిక్షలు పడేలా చూడాలని ఆయన స్పష్టం చేశారు. నేడు రాష్ట్ర సచివాలయంలో శాంతిభద్రతలపై ఆయన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.

* **కేసుల నమోదులో జాప్యం వద్దు.. నేరగాళ్లకు కఠిన శిక్షలు పడాలి**

ఈ సమావేశంలో సీఎం విజయ్ మాట్లాడుతూ.. లైంగిక నేరాలకు సంబంధించిన కేసుల విచారణలో జాప్యం జరగకూడదని అన్నారు. చట్టపరమైన చర్యలను అనుసరించి, దోషులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సకాలంలో దర్యాప్తు పూర్తి చేసి, నేరగాళ్లకు కఠిన శిక్షలు పడితే, భవిష్యత్తులో ఇలాంటి నేరాలు చేయడానికి ఇతరులు భయపడతారని ఆయన అభిప్రాయపడ్డారు. మహిళలు, చిన్నారులపై నేరాలకు సంబంధించిన కేసుల విచారణలో ఎలాంటి జాప్యం లేకుండా దర్యాప్తు సంస్థలు, సంబంధిత ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సీఎం ఆదేశించారు. నేరాల నివారణకు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టడం కూడా చాలా ముఖ్యమని ఆయన నొక్కిచెప్పారు.

# క్యూలైన్లలో నిరీక్షణకు చెక్

తిరుపతి: వేసవి సెలవుల కారణంగా తిరుమలలో భక్తుల రద్దీ పోటెత్తుతోంది. ప్రతిరోజూ సుమారు 80 వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకుంటున్నారు. సర్వదర్శనానికి 24 గంటల సమయం పడుతోంది. పసిపిల్లలు, వృద్ధులతో వచ్చే సామాన్య భక్తులు గంటల తరబడి క్యూలైన్లు, కంపార్టుమెంట్లలో వేచి ఉండలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో భక్తుల కష్టాలను తీర్చడానికి తితిదే కల్పిస్తున్న 'రీఎంట్రీ' (తిరిగి ప్రవేశించడం) సదుపాయం ఎంతగానో ఉపయోగపడుతోంది.

**సద్వినియోగం ఇలా..**

సర్వదర్శనం టోకెన్ కలిగిన భక్తులు తాత్కాలికంగా క్యూలైన్ నుంచి బయటకు వెళ్లి తిరిగి దర్శన సమయానికి క్యూలైన్లోకి ప్రవేశించేందుకు వీలు కల్పించే సదుపాయమే ఈ రీఎంట్రీ. భక్తులు ముందుగా సర్వదర్శనం క్యూలైన్‌లోకి వెళ్లాక వైకుంఠం2లో ఆధార్ సమర్పించి టోకెన్ పొందాలి. బయటకు వెళ్లాలనుకొనేవారికి 17వ కంపార్టుమెంట్ వద్ద రీఎంట్రీ పాస్ ఇస్తారు. అక్కడే ఉన్న ఎగ్జిట్ పాయింట్ ద్వారా బయటకు రావచ్చు. ఆ సమయంలో తప్పనిసరిగా టోకెన్‌ను స్కాన్ చేయించుకోవాలి. బయటకు వచ్చిన తర్వాత భక్తులు తమ గదులకు వెళ్లి విశ్రాంతి తీసుకోవచ్చు లేదా తిరుమలలోని ఇతర ప్రదేశాలను సందర్శించవచ్చు.

**తిరిగి ఎలా వెళ్లాలి?**

తితిదే అధికారులు కేటాయించిన సమయానికి 15 నుంచి 20 నిమిషాల ముందుగానే సంబంధిత కంపార్టుమెంట్ వద్దకు చేరుకోవాలి. తిరిగి లోపలికి వెళ్లడానికి లడ్డూ కౌంటర్ల వైపు కాకుండా, మ్యూజియం పక్క నుంచి డబ్ల్యూ4 గేట్ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. అక్కడే రీఎంట్రీ కేంద్రం ఉంటుంది. నిర్ణీత సమయానికి లోపలికి వెళ్లి కంపార్టుమెంట్లు తెరుచుకున్న తర్వాత కేవలం 2 నుంచి 4 గంటల వ్యవధిలోనే స్వామివారి దర్శనం పూర్తవుతుంది.

# పాఠశాలలు ప్రారంభానికి ముందే పాఠ్య పుస్తకాల పంపిణీ పూర్తి చేయాలి

*** జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.**

జనగామ, ప్రజాస్ఫూర్తి,: జిల్లా లో కొత్త విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠ్య పుస్తకాల పంపిణీ ప్రక్రియ ను వేగవంతం చేసి, పాఠశాలలు ప్రారం భానికి ముందే పాఠ్య పుస్తకాల పంపిణీ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. జిల్లా కు మొత్తం 1,93,140 పాఠ్య పుస్తకాలు చేరుకున్నాయని, పాఠశాలలు ప్రారం భం అయ్యే లోపే అన్ని పాఠశాలలకు పుస్తకాలు చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పాఠశాల విద్యాశాఖ పుస్తకాల గోదాంలో నిల్వ ఉన్న పాఠ్య పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ సోమవారం బచ్చన్నపేట మండలానికి పంపిణీ చేస్తూ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 1వ తేదీ లోపు మొత్తం పంపిణీ ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. పుస్తకాల లెక్కలను సక్రమంగా నమోదు చేయడంతో పాటు, రాబోయే వర్క్ బుక్స్ ఖాతాలను కూడా పద్ధతిగా నిర్వహించాలని సూచించారు. మొదటి రోజే ప్రతి విద్యార్థికి పుస్తకాలు అందేలా చూడాలని సూచించారు. చెదలు, ఎలుకల బారిన పడకుండా పుస్తకాలను భద్రపరి చి, మండలాలకు సకాలంలో చేరే లా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెండవ విడత పుస్తకాలు రానున్న నేపథ్యం లో వాటిని ఐ.డి.ఓ.సి గోదాం లో నిల్వ చేసేందుకు అవసరమైన స్థలాన్ని కేటాయిస్తామని తెలిపారు. అలాగే ప్రతీ ప్రాథమిక పాఠశాలకు కాంపౌండ్ వాల్ నిర్మాణానికి అంచనా ప్రతిపాదనలు సమర్పించాలని




అధికారులను ఆదేశించారు. దీని ద్వారా బాలబాలికలకు సురక్షితమైన ఆట స్థలం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో యన్.టి బుక్స్ మేనేజర్, జీసీడీఓ గౌసియా బేగం, సీఎంఓ నాగరాజు, బచ్చన్నపేట, జనగామ మండల విద్యాధికారులు శంకరరెడ్డి, వెంకటరెడ్డి, పుస్త కాల పంపిణీ నోడల్ టీం సభ్యులు కేశవరావు, మధు,రెండు మండలాల సీఆర్పీ లు పాల్గొన్నారు.

## చిన్నారుల ఆరోగ్యమే సమాజ భవిష్యత్తుకు బలం




జయశంకర్ భూపాలపల్లి జిల్లా : జిల్లాలో మహిళా వారోత్సవాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. "జంక్ ఫుడ్‌కు నో చెప్పండి" అనే నినాదంతో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషకాహార అవగాహన కార్యక్రమం ఆకట్టుకుంది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన చిన్నారులే సమాజానికి బలమైన భవిష్యత్తని పేర్కొన్నారు. ఐదేళ్లలోపు చిన్నారులకు సమతుల్యమైన పోషకాహారం అందించడం ద్వారా శారీరక, మానసిక వికాసం సాధ్యమవుతుందని తెలిపారు. స్థానికంగా లభించే ఆకుకూరలు, చిరుధాన్యాలు, కూరగాయలతో తయారుచేసిన పౌష్టికాహార వంటకాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళలు, అంగన్‌వాడీ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని పోషకాహారం ప్రాధాన్యాన్ని వివరిస్తూ అవగాహన కల్పించారు."మహిళా ఉన్నతి - తెలంగాణ ప్రగతి" లక్ష్యంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల్లో భాగంగా వంటల పోటీలు, పోషకాహార ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకుంటున్నాయి.

## మహాదేవపూర్‌లో ఎల్అండ్‌టీ గెస్ట్ హౌస్‌లో అగ్నిప్రమాదం



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం అంబటిపల్లి గ్రామ సమీపంలోని ఎల్అండ్‌టీ గెస్ట్ హౌస్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాద ఘటనను జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదివారం పరిశీలించారు. ఘటనకు గల కారణాలు, జరిగిన నష్టం వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంపై పూర్తి స్థాయి విచారణ చేపడుతున్నామని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అగ్నిప్రమాదం జరిగినట్లు సమాచారం అందిన వెంటనే మహాదేవపూర్ సీఐ వెంకటేశ్వర్లు సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. ఘటనలో జరిగిన ఆస్తి నష్టంపై అధికారులు అంచనా వేస్తున్నారు.

## చైతన్య గ్రామ మహిళా సంఘం నూతన బిల్డింగ్ శంకుస్థాపన



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ మండల కేంద్రంలోని పర్వతగిరి గ్రామంలో చైతన్య గ్రామ మహిళా సంఘం నూతన వివో బిల్డింగ్ ను మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మహిళలను అభివృద్ధి పదంలో నడిపించడానికి గాను అదేవిధంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేసే విధంగా అడుగులు వేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు మొట్టమొదట ప్రాధాన్యత ఇస్తూ మహిళలకు వడ్డీ లేని రుణాలనిస్తూ ముందుకు వారిని నడిపిస్తూ ప్రోత్సహిస్తున్నటువంటి ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అనే కొనియాడారు.ఈ కార్యక్రమంలో పర్వతగిరి గ్రామ సర్పంచ్ చల్ల అనిత వెంకటేశ్వర్లు , ఉప సర్పంచ్, గ్రామ పార్టీ అధ్యక్షులు,వార్డు మెంబర్లు,ఇందిరమ్మ కమిటీ సభ్యులు,గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, సంబంధిత ప్రభుత్వ అధికారులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ, అంగన్వాడి భవనాలను మంజూరు చేయండి

*** మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు భూక్య కృష్ణ నాయక్**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : గ్రామ పంచాయతీల అభివృద్ధికి అధికారులు ప్రజాప్రతినిధులు సహకరించాలని అక్కన్నపేట మండలంలోని మైసమ్మ వాగు తండా గ్రామపంచాయతీకి భవనము అంగన్వాడి భవనము నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేయాలని కోరుతూ హుస్నాబాద్ ఆర్డీవో కార్యాలయంలో ప్రజావాణిలో కార్యక్రమంలో అక్కన్నపేట మండలం సర్పంచుల ఫోరం అధ్యక్షులు భూక్య కృష్ణ నాయక్ వినతి పత్రాన్ని అందించారు.ఈ సందర్భంగా కృష్ణ నాయక్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని,మండలంలో అనేక గ్రామపంచాయతీ తండాలలో పక్కా భవనాలు లేక అద్దె భవనాలల్లో గ్రామ పంచాయతీలను నడపవలసిన పరిస్థితి ఏర్పడుతుందని మరియు అంగన్వాడి సెంటర్లను కూడా అద్దెకు తీసుకొని నడుపుతున్నామని వీటికి కూడా ప్రభుత్వం పక్కా భవనాలను మంజూరు చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.స్థానిక ఎమ్మెల్యే మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ చూపాలని గ్రామాల అభివృద్ధికి సహకరిస్తూ నిధులు మంజూరు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## కాళేశ్వరంలో భక్తజన సందోహం..

*** పుష్కర ఘాట్ల వద్ద కిక్కిరిసిన త్రివేణి సంగమం**





జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి: "కాళేశ్వర నివాసోవా... కాళేశ్వరస్య స్మరణం సర్వపాప వినాశనం....." అంటూ భక్తి తరంగాల్లో తేలియాడుతున్న భక్తజనం... కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద పవిత్ర సరస్వతి అంత్య పుష్కర స్నానాల్లో మునిగితేలుతున్నారు. పుష్కరాల 5వ రోజు సోమవారం త్రివేణి సంగమం భక్తులతో కిక్కిరిసిపోయింది.తెల్లవారుజామున నుంచే ఘాట్ల వద్ద భక్తుల రద్దీ పెరిగి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు అంతర్వాహిని సరస్వతి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. "హర హర మహాదేవ" నినాదాలతో త్రివేణి సంగమం మార్మోగుతోంది. భక్తుల తాకిడి రోజురోజుకూ పెరుగుతుండటంతో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పర్యవేక్షణలో అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.ఘాట్ల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు గజఈతగాళ్లు, ఎన్డీఆర్ఎఫ్, సింగరేణి రెస్క్యూ బృందాలు, బోట్లను సిద్ధంగా ఉంచి భక్తుల భద్రతకు చర్యలు చేపట్టారు. పుష్కరాల తొలి 12 రోజులకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందని పురాణాలు చెబుతున్నాయి. ఆయా రోజుల విశిష్టతకు అనుగుణంగా దానాలు చేయడం ద్వారా పుణ్యం కలుగుతుందని భక్తుల విశ్వాసం. సోమవారం శివునికి ఇష్టమైన రోజు కావడంతో...పుష్కర సరస్వతి ఒడిలో స్నానమాచరించి దానధర్మాలు నిర్వహించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు

## పంట అవశేషాలను తగలబెట్టవద్దు



పాలేరు, ప్రజా స్ఫూర్తి : కూసుమంచి మండలంలోని అజ్మీరా హీరామాన్ తండా గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో పంట అవశేషాలను తగలబెట్టడం ద్వారా కలిగే అనర్థాలు వాటిని ఏ విధంగా భూమిలో కలియదున్నాలి అనే అంశంపై రైతులకు వివరించడం జరిగింది.అనంతరం నిషేధిత ఎచ్ టి పత్తి సాగు, విత్తనాల కొనుగోలులో తీసుకోవలసిన జాగ్రత్తలు, విచక్షణా రహితంగా ఎరువులను వాడటం వలన కలిగే అనర్థాలు , నానో ఎరువుల వినియోగం , నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించడం జరిగింది. గ్రామాలలో ఎవరైనా అపరిచిత వ్యక్తులు కానీ, మరెవరైనా వ్యక్తులు గాని విత్తనాలను అనుమతి లేకుండా విక్రయిస్తున్నట్లయితే వ్యవసాయ శాఖ వారికి వెంటనే సమాచారం అందించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి నవీన్ మరియు రైతులు పాల్గొన్నారు.

## మహిళలు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవరుచుకోవాలి

*** జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**




భువనగిరి, ప్రజాస్ఫూర్తి : మహిళలు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవరుచుకోవాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళా, శిశు, వికలాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సముదాయంలో నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల్లో భాగంగా తొలి రోజు నిర్వహించిన ఫుడ్ మేళాను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళల ఆరోగ్యం, భద్రత మరియు పోషకాహారంపై పలు సూచనలు చేశారు. అనంతరం మహిళా వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేయించారు. మేళాలో తక్కువ ఖర్చుతో అధిక పోషకాలు అందించేలా మహిళలు తయారు చేసిన వంటకాలను పరిశీలించి, వాటి తయారీ విధానం మరియు పోషక విలువల గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం భువనగిరి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఎనీమియా మరియు స్క్రీనింగ్ పరీక్షలను పరిశీలించారు. ఈ పరీక్షలకు 25 మంది గర్భిణీలు హాజరై ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, డీఆర్ఓ జయమ్మ, ఆర్డీవో కృష్ణారెడ్డి, డీఆర్డీఓ నాగిరెడ్డి, జిల్లా వైద్యాధికారి మనోహర్, సీడీపీవోలు వెంకటరమణ, శైలజ, స్వరాజ్యం, యామిని, మహిళా సాధికారత బృందం, సూపర్వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు మరియు సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

*** ఏసీపీ భీమ్ శర్మ.**



రఘునాథపల్లి, ప్రజాస్ఫూర్తి: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్టేషన్ ఘనపు ర్ ఏసీపీ భీమ్ శర్మ అన్నారు. సోమవారం రూరల్ పరిధిలోని సర్కిల్ కార్యా లయం లో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. రఘునాథపల్లి, లింగాలగణపురం మండలాలకు చెంది న రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించి, తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ప్రజల రక్షణ, భద్రత కల్పించడం, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అరికట్టడ మే పోలీసుల ప్రధాన లక్ష్యమని తెలి పారు. అనుమానాస్పద వ్యక్తులు కని పించిన వెంటనే పోలీసులకు సమాచా రం అందించాలని ప్రజలను కోరారు. రౌడీ షీటర్లు సత్ప్రవర్తన తో ఉండి సమాజం లో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు సహకరించాలన్నారు. ప్రజాజీవనానికి భంగం కలిగించే చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాకేష్ రెడ్డి, రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎస్సైలు నరేష్ యాదవ్, శ్రవణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## లారీ, ద్విచక్ర వాహనం ఢీ.. యువకుడు దుర్మరణం



జనగామ, ప్రజాస్ఫూర్తి : మండ లంలోని చంపక్ హిల్స్ పసరమడ్ల మధ్య సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన, ఎం.సి.హెచ్ ఆసుపత్రి సమీపంలో చోటు చేసుకుంది. వేగంగా వచ్చిన లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొనడం తో బచ్చన్నపేట మండలం బసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నల్ల వెంకటేష్ (24), తండ్రి నల్ల మల్లయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమా ద సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఆసు పత్రికి తరలించారు. ఘటన పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడు తున్నట్లు పోలీసులు తెలిపారు.

## మహిళలందరికీ ఇందిరమ్మ చీరలు ఇవ్వాలి



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ చీరల పథకం మొదటి విడతలో డ్వాక్రా గ్రూప్ మహిళలకే చీరలు ఇస్తామనడం సరికాదని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ అన్నారు. సోమవారం డివిజన్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాలు దాటిన మహిళలందరికీ ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో బతుకమ్మ చీరలు 18 సంవత్సరాలు దాటిన వారందరికీ ఇచ్చే వారిని గుర్తుచేశారు. విడతల వారీగా కాకుండా అందరికీ ఒకేసారి చీరలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఓ ఉపేందర్, ఆర్‌పి కవిత, డ్వాక్రా సంఘాల

# ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు వెంటనే కేటాయించాలి

* **సిపిఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్**

జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు (డబుల్ బెడ్ రూమ్) వెంటనే కేటాయించాలని సిపిఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. ఇండ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు డబుల్ బెడ్ రూమ్ వెంటనే కేటాయించాలని సిపిఎం గాజులరామారం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ జోనల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు గాజులరామారం డివిజన్ కార్యదర్శి ఎం డి జాకీర్ పాల్గొని మాట్లాడుతూ




గాజులరామారం సర్కిల్ పరిధిలో వివిధ బస్తీలలో పేదలు ఉండటానికి ఇల్లు లేక గత 10 సంవత్సరాలనుండి. రాజకీయ పార్టీల ఎన్నికల వాగ్దానాల మేరకు గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో మీ సేవలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకోగా ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ ల అమలు సందర్భంగా దరఖాస్తులు చేసుకోవడం జరిగిందన్నారు. గత 9 ఏళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పుడున్న రెండున్నర ఏళ్ల కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పేదల నుండి. వేల సంఖ్యలో దరఖాస్తులు తీసుకోనీ వందల సంఖ్యలో మంజూరు చేస్తున్నారని ఇది ఏ మాత్రం. సమంజసం కాదని అన్నారు. ఇప్పుడు ఉన్న.కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పేదలకు ఇస్తామని ప్రకటనల ద్వారా చెబుతున్నారని. అవి ఎలాంటి అవకతవకలు జరగకుండా. నిజమైన లబ్ధిదారులకు ఇవ్వాలని అన్నారు. లేనిపక్షంలో కుత్బుల్లాపూర్ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూములను ఇల్లు లేని పేదలతో ఆక్రమిస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు పసుల అంజయ్య రావుల స్వాతి. ఆర్ లక్ష్మి. బురాన్. ముక్తార్. కృష్ణ గోపి తదితరులు పాల్గొన్నారు.

## గోవధ కేంద్రాలపై చర్యలు తీసుకోవాలని తహసిల్దార్ కు వినతి



ప్రజాస్ఫూర్తి, జన్నారం : జన్నారం మండలంలో అక్రమంగా నిర్వహిస్తున్న గోవధ కేంద్రాలపై చర్య తీసుకుని నిషేధించాలని బజరంగదళ్, హిందువాహిని, గో రక్షక్ వారి ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ బక్కయ్యకు వినతి పత్రం అందజేశారు. గోమాత అనేది హిందూ సమాజానికి ఆరాధ్య దైవం అని హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా జరుగుతున్న అక్రమ గోవదలను అరికట్టి ధర్మాన్ని కాపాడాలని, తక్షణమే స్పందించి అక్రమంగా నిర్వహిస్తున్న గోవధ కేంద్రాలపై దాడులు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హిందూ వాహిని జిల్లా సహ సంయోజక్ దండవేణి శ్రీధర్, మండల సంయోజక్ చెరుకు ప్రణయ్, బజరంగ్ దళ్ మండల ప్రముఖ్ పిల్లి అన్వేష్, కస్తులపురి నరేష్, పందిరి మనీష్, రిశ్వంత్, మహేష్ గౌడ్ సాయి సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

: **ఎంపీడీఓ శివశంకర్ రెడ్డి**



లింగాల ఘణపురం / జనగామ, ప్రజా స్ఫూర్తి : మండల వ్యాప్తంగా 14 మహిళా భవనాలకు సోమ వారం శంకుస్థాపన చేసినట్లు ఎంపీడీఓ శివశంకర్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభు త్వం మహిళల అభ్యున్నతికి చిత్తశుద్ధి తో పని చేస్తోందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక లో భాగంగా మహిళా వారోత్సవాలలో 14 గ్రామ పంచాయతీలలో ఒక్కొక్క మహి ళా భవనానికి ఎన్.అర్.ఈ.ఎస్ పథకం క్రింద ప్రభుత్వం 10 లక్షలు కేటాయించి న్నట్లు తెలిపారు. మహిళా అభ్యున్నతే రాష్ట్ర అభివృద్ధి అనే సంకల్పం తో ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని వెల్లడించారు. మారు మూల గ్రామాల్లో ని మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు.రాష్ట్రం లోని మహిళలను కోటీశ్వరులుగా తీర్చి దిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో మండల సమాఖ్య అధికారులు, సీసీలు, వివిధ గ్రామాల సీ.ఏ లు, వీఓఏ లు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు టోపీలు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ



ప్రజాస్ఫూర్తి ,జన్నారం : జన్నారం మండలంలోని పొనకల్ గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలకు సోమవారం రోజున పొనకల్ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ టోపీలు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న ఎండలపట్ల జాగ్రత్తలు వహించాలని, వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జక్కు భూమేష్, ఉప సర్పంచ్ అప్పాల జలపతి,వార్డు సభ్యులు పంచాయతీ కార్యదర్శి రాహుల్ గుప్తా, బిల్ కలెక్టర్ అనిల్ కుమార్ మరియు గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## జనగామ చౌరస్తా లో పోలీసుల నకాబంది



జనగామ,ప్రజాస్ఫూర్తి: వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పట్టణం లోని చౌరస్తా లో మరియు లింగాల ఘణపురం పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం డీసీపీ రాజామహేంద్ర నాయక్ పర్యవేక్షణలో పోలీసులు నకా బంది నిర్వహించారు. ఈ కార్యక్రమం లో సీఐ సత్యనారాయణ రెడ్డి, ఎస్ఐ లు, పోలీస్ సిబ్బంది కలిసి చేపట్టారు. నకాబంది సందర్భంగా వాహనాలను విస్తృతంగా తనిఖీలు నిర్వహించి, అనుమానాస్పద వ్యక్తులు, పత్రాలు లేని వాహనాలు, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారి పై ప్రత్యేక దృష్టి సారించారు. అక్రమ రవాణా నియంత్ర ణ, నిషేధిత వస్తువుల గుర్తింపు, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా కట్టుదిట్ట మైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు ట్రాఫిక్ నిబంధ నలు తప్పనిసరిగా పాటించాలని, చట్టా లను గౌరవించాలని పోలీసులు సూచించారు.

## తడిసిన వడ్లను వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి

* **మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్**

ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో వేలాది వడ్ల బస్తాలు తడిసిపోవడం అత్యంత బాధాకరమని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. తడిసిన వడ్లను నాణ్యత పేరుతో తిరస్కరించకుండా ప్రత్యేక నిబంధనలతో కొనుగోలు చేయాలని, స్థానిక రైస్ మిల్లర్ల సహకారంతో



కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే మార్కెట్ యార్డులో తాత్కాలిక షెడ్లు, టార్పాలిన్లు ఏర్పాటు చేసి మిగిలిన ధాన్యాన్ని రక్షించాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఆర్థిక నష్టం కలగకుండా ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి, వెంటనే కొనుగోలు ప్రక్రియ ప్రారంభించాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ డిమాండ్ చేశారు. “రైతు నష్టపోతే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుంది. రైతులను ఆదుకోవడం ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం” అని ఆయన పేర్కొన్నారు.

## గుంజల్‌పహాడ్‌లో శివలింగం మాయం హేయమైన చర్య

* **బిజెపి నేత వెంకటేశ్వర రెడ్డి**




ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : గుంజల్ పహాడ్ గ్రామంలోని ఒక దేవాలయం నుంచి పవిత్రమైన శివలింగాన్ని దుండగులు దొంగిలించడం అత్యంత హేయమైన చర్య అని కొందుర్గు మండల పిఎసిఎస్ మాజీ చైర్మన్, బిజెపి సీనియర్ నాయకులు వెంకటేశ్వర రెడ్డి తీవ్రంగా ఖండించారు. గుంజల్‌పహాడ్ దేవాలయంలో శివలింగం మాయమైందన్న విషయం తెలుసుకున్న ఆయన, సోమవారం పలువురు స్థానిక నేతలతో కలిసి ఆలయాన్ని సందర్శించారు. అక్కడ శివలింగాన్ని దొంగిలించిన తీరును, జరిగిన ఉదంతాన్ని గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర రెడ్డి మరియు ఇతర నేతలు మాట్లాడుతూ దేవాలయాలు సనాతన ధర్మానికి నిదర్శనాలు. గ్రామాల్లో ప్రజల మధ్య ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించడానికి ఇవి ఎంతగానో దోహదపడతాయన్నారు. పల్లెల్లో ఇలాంటి అపచారాలకు, దొంగతనాలకు పాల్పడటం అత్యంత విచారకరమన్నారు. . కేవలం కొందరి వ్యక్తిగత కక్షల వల్లే పవిత్రమైన శివలింగాన్ని మాయం చేశారని అర్థమవుతోందన్నారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడిన వారిని వదిలిపెట్టకూడదని వారు డిమాండ్ చేశారు.ఆలయాన్ని సందర్శించిన వారిలో పద్మారం సర్పంచ్ మోనాచారి, చింతకుంట తండా సర్పంచ్ రామచంద్రం, జాకారం మాజీ సర్పంచ్ రాజు, పద్మారం మాజీ ఎంపిటిసి మామయ్యతో పాటు గాలి గూడెం జగదీష్, వీరన్న, వెంకటన్న, అనంత రెడ్డి, నరసింహారెడ్డి, రామకృష్ణారెడ్డి తదితర ముఖ్య నాయకులు, గ్రామస్థులు ఉన్నారు. మాయమైన శివలింగాన్ని త్వరగా రికవరీ చేసి, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## నివాస అనుమతులతో వైద్యశాల నిర్మాణం సబబేనా?

* **రిచ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను సీజ్ చేయాలి**
* **భవనానికి సెల్లార్ అనుమతి ఉందా?**
* **అక్కృతి నిర్మాణ సంస్థపై సమగ్ర విచారణ జరపాలి - రమణి మాల్యాల..**



ప్రజాస్ఫూర్తి,కుత్బుల్లాపూర్: బాచుపల్లి కేజీఎం కాలనీలో నివాస గృహ నిర్మాణానికి మంజూరు చేసిన అనుమతులతో భారీ వైద్యశాల ఏర్పాటు చేసారని ఆరోపిస్తూ ఆశా జ్యోతి మహిళా వేదిక అధ్యక్షురాలు రమణి మాల్యాల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె సంబంధిత అధికారులకు ఫిర్యాదు సమర్పించారు. సర్వే నంబర్లు 111, 112 పరిధిలోని ప్లాట్ నంబర్ 38లో “రీచ్ బహుళ వైద్య సేవల ఆసుపత్రి” పేరుతో నిర్మాణం జరుగుతోందని, దీనికి అక్కృతి నిర్మాణ సంస్థ నిజాంపేట్ కార్పొరేషన్ నుంచి నివాస గృహ నిర్మాణ అనుమతి పొందిందని వివరించారు. అనంతరం అదే నిర్మాణానికి వినియోగ ధృవపత్రం కూడా జారీ చేయడం పలు అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. అనుమతి పత్రాల్లో స్థల విస్తీర్ణాన్ని 792 చదరపు గజాలుగా చూపించినప్పటికీ, అసలు ప్రణాళిక ప్రకారం ప్లాట్ నంబర్ 38 కేవలం 226 చదరపు గజాలే ఉందని ఆరోపించారు. అలాగే ఆసుపత్రి నిర్మాణం సమీప కాలువకు 15 నుంచి 30 మీటర్ల పరిధిలో ఉండటం వల్ల ఇది రక్షిత మండల నిబంధనలకు విరుద్ధంగా ఉండే అవకాశముందని పేర్కొన్నారు. ఈ నిర్మాణంపై మహానగర అభివృద్ధి సంస్థ అధికారులు సమగ్ర పరిశీలన చేపట్టాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్లాట్ నంబర్ 38 పేరుతో నిర్మాణం చేపడుతూ సమీపంలోని 37, 39, 40 ప్లాట్లను కూడా ఆక్రమించినట్లు కనిపిస్తోందని ఆరోపించారు. నివాస గృహ నిర్మాణ అనుమతులతో నాలుగు అంతస్తుల భవనానికి అనుమతి తీసుకుని, తర్వాత దానిని వాణిజ్య వైద్యశాలగా వినియోగించడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. ఇంకా ఈ భవనానికి వ్యాపార అనుమతి మంజూరు చేయడంపై కూడా ఆమె తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నివాస గృహానికి వ్యాపార అనుమతి ఎలా జారీ చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలని, సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణ భద్రతకు ముప్పు కలిగించే విధంగా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరిగితే తీవ్ర పరిణామాలు ఉంటాయని రమణి మాల్యాల హెచ్చరించారు. అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వం, కార్పొరేషన్, మహానగర అభివృద్ధి సంస్థ అధికారులు తక్షణమే సమగ్ర విచారణ జరిపి నిజాలు వెలుగులోకి తీసుకురావాలని కోరారు.

## అడవి పంది దాడిలో ఒకరి కి గాయాలు



ప్రజాస్ఫూర్తి , జన్నారం : మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని చింతలపల్లి గ్రామానికి చెందిన పెంకర్ల మల్లేష్ అనే గొర్ల కాపరి పై అడవి పంది దాడి చేయడంతో గాయాల పాలయ్యారు. గొర్రెలను మేపేందుకు అడవి పక్కకు వెళ్లిన ఆయనపై ఒక్కసారిగా అడవి పంది దాడి చేసి గాయపరిచిందని. పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు రావడం వల్ల పంది పారిపోయిందని బాధితుడు తెలిపారు. ఈ దాడిలో మల్లేష్ కుడి కాలు తొడపై తీవ్రంగా గాయమైందని వెంటనే అక్కడ ఉన్నవారు జన్నారంలోని ప్రైవేట్ హాస్పిటల్ తరలించి చికిత్స చేయించారని బాధితుడు మల్లేష్ తెలిపారు. అడవి పంది దారిలో గాయపడ్డ పెంకర్ల మల్లేష్‌కు అటవీశాఖ అధికారులు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని చింతల పల్లె సర్పంచ్ పంజాల సురేష్ గౌడ్ కోరారు.

## వడదెబ్బతో కూలి మృతి



ప్రజాస్ఫూర్తి, జన్నారం : వడదెబ్బ తగిలి ఒకరు మృతి చెందాడు. మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం జన్నారం గ్రామానికి చెందిన యాట ఇందయ్య(60) అనే కూలీ గత రెండు రోజుల క్రితం భవన నిర్మాణ కూలి పనులకు వెళ్లారు. పనులు చేస్తుండగా వడదెబ్బ తగిలి స్పృహ పోయాడని వెంటనే జన్నారంలోని హాస్పిటల్ కు తరలించగా ప్రథమ శిక్షలు చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం జగిత్యాల హాస్పిటల్ కు తరలించారని అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు తెలిపారు. ఇందయ్యకు భార్య దుబ్బరాజు తో పాటు గంగాధర్, జగన్ అనే కుమారులు ఉన్నారని వీరికి వివాహమైంది అని పేర్కొన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఇందయ్య కుటుంబాన్ని జన్నారం సర్పంచ్ అజ్మీర కళావతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నందు నాయక్ లు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

## అదనపు ట్రాన్స్ఫార్మర్ అమర్చాలని విద్యుత్ శాఖ ఏఈకి వినతి



ప్రజాస్ఫూర్తి ,జన్నారం : జన్నారం మండలం కలమడుగు గ్రామంలోని 8వ వార్డుకు చెందిన పలువురు తమ వార్డులో లో వోల్టేజ్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని,కావున అదనవు సింగిల్ ఫేస్ ట్రాన్స్ఫార్మర్ అమర్చాలని కోరుతూ సోమవారం రోజున విద్యుత్ శాఖ ఏఈ కి వినతిపత్రం అందజేశారు. ఎనిమిదవ వార్డు లో ఉన్న కోడూరి భూమన్న నివాసం వద్ద ఉన్న సింగిల్ పేస్ ట్రాన్స్ఫార్మర్ ఓవర్లోడ్ కారణంతో తరచూ ఫీజులు కొట్టేయడం కేబుల్స్ కాలిపోవడం జరుగుతుందని కావున ఇట్టి విషయంపై కలమడుగు గ్రామ పాలకమండలికి ఫిర్యాదు చేసినప్పటికీ శాశ్వత పరిష్కారం చూపడం లేదని అన్నారు. కావున అదనపు సింగిల్ ఫేస్ ట్రాన్స్ఫర్ అమర్చి మా బాధలు తీర్చాలని కోరారు. అలాగే విద్యుత్ తీగలు డ్యామేజ్ ఉన్న స్థానంలో కొత్తవి అమర్చాలని కోరారు.వినతిపత్రం అందచేసిన వారిలో ఎనిమిదవ వార్డు సభ్యుడు ఎల్కుసి సత్తన్న, లక్ష్మణ్, నరేష్, గోపాల్ తదితరులు ఉన్నారు.

## భార్య కాపురానికి రావడం లేదని ఉరేసుకుని భర్త ఆత్మహత్య

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: భార్య కాపురానికి రావట్లేదనే ఆవేదనతో ఓ భర్త ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడిన ఘటన ముస్తాబాద్ మండలం మోహినికుంటలో జరిగింది. గ్రామానికి చెందిన మోతే పూర్ణ చందర్ (30)కు రెండేళ్ల క్రితం వివాహం కాగా, వీరికి ఆరు నెలల ఆడపిల్ల ఉంది. భర్త మద్యానికి బానిసవ్వడంతో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో భార్య కొంతకాలంగా తన పుట్టింట్లోనే ఉంటోంది. భార్య కాపురానికి రావడం లేదని. మనస్థాపంతో సోమవారం మధ్యాహ్నం పూర్ణ చందర్ ఇంట్లోని తన గదిలో ఉరివేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. ఎంతకీ పూర్ణ చందర్ బయటకు రాకపోవడంతో అనుమానంతో గమనించిన తండ్రి కిషన్, స్థానికులు లోపలికి వెళ్లి చూడగా ఉరివేసుకుని కనిపించాడు. వెంటనే ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. అప్పటికే పూర్ణ చందర్ మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. ఈ మేరకు తండ్రి కిషన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ గణేష్ తెలిపారు

# షిరిడి సాయిబాబా జీవితం మానవత్వం సేవాభావం సమానత్వానికి ప్రతీక

*** సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : సాయిబాబా జీవితం మానవత్వం, సేవాభావం, సమానత్వానికి ప్రతీక అని సిద్ధగురు రమణానంద మహర్షి అన్నారు. షిర్డీ సాయిబాబాపై ఇటీవల కాలంలో పలువురు వ్యక్తులు చేస్తున్న వివిధ ఆరోపణలకు స్పష్టతనిస్తూ, ప్రామాణిక ఆధారాలతో సిద్ధగురు రమణానంద మహర్షి రచించిన "శత ప్రశ్న శరసంధానం" గ్రంథాన్ని ఘనంగా ఆవిష్కరించారు. నాగిరెడ్డిపల్లిలోని రమణేశ్వరంలో జరిగిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో వైభవంగా నిర్వహించారు. షిర్డీ సాయిబాబా జీవితం, బోధనలు, ఆధ్యాత్మిక పరంపరపై వస్తున్న సందేహాలు, విమర్శలు, ఆరోపణలకు సమాధానంగా ఈ గ్రంథాన్ని సిద్ధం చేసినట్లు తెలిపారు. "శత ప్రశ్న శరసంధానం" పేరుతో రూపొందించిన ఈ పుస్తకాన్ని సిద్ధగురు రమణానంద మహర్షి మొత్తం 11 భాషల్లో రచించగా భక్తుల్లో నెలకొన్న అనేక సందేహాలకు చారిత్రక, ఆధ్యాత్మిక, ప్రామాణిక ఆధారాలతో సమగ్ర వివరణ ఇవ్వడమే ఈ గ్రంథం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి తెలంగాణతో పాటు వివిధ ప్రాంతాల నుంచి ప్రముఖ షిర్డీ సాయి దేవాలయాల నిర్వాహకులు, ట్రస్టు సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు సాయి మందిరాల ప్రతినిధులు మాట్లాడుతూ, సాయిబాబాపై అసత్య ప్రచారాలు జరుగుతున్న నేపథ్యంలో వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. రమణేశ్వరంలో జరిగిన ఈ కార్యక్రమం భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా ముగిసింది.ఈ కార్యక్రమంలో సాయి బాబా ఐక్య వేదిక అధ్యక్షుడు మంచికంటి ధనుంజయ,ప్రధాన కార్యదర్శి పీవీ ప్రసాద్,కోశాధికారి గుండా మల్లయ్య, మైనంపాటి ప్రసాద్, శ్రీ అనిల్ కుమార్, సాయి వాహిని, శ్యామ్, వీడియల సంజయ్ కుమార్,విజయ లక్ష్మి సాయిబాబా భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## నాగయ్యగడ్డలో ఆరోగ్య శిబిరం



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం:రామవరం అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో సోమవారం నాగయ్యగడ్డలో హెల్త్ క్యాంపును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా క్యాంప్‌నకు వచ్చిన ప్రజలకు షుగర్, బీపీ వంటి పలు రకాల వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీచేశారు. 17 వ డివిజన్ కార్పొరేటర్ ఎర్రవెల్లి శంకర్ వైద్య శిబిరాన్ని పరిశీలించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలుఅందించాలని కోరారు. అనంతరం పబ్లిక్ హెల్త్ మేనేజర్ వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎండాకాలంలో ప్రజలు ప్రతీరోజూ ఉదయం 10 గంటల లోపు, సాయంత్రం 4 గంటల తర్వాతనే బయటకు వెళ్లాలని సూచించారు. మంచినీరు, మజ్జిగ తీసుకెళ్లాలని, టోపీ, గొడుగు విధిగా ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు బి.తార, పి.శ్రీలక్ష్మి, మెప్మా ఆర్పీ అనిత తదితరులు పాల్గొన్నారు.


## వాహనాల విడి భాగాల వేలం పాట




ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు ఈ నెల 30వ తేదీన పోలీస్ వాహనాలకు సంబంధించి విడిభాగాల వేలంపాట నిర్వహించనున్నట్లు రిజర్వు ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఓ. సుధాకర్‌రావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలీస్ వాహనాల పాత టైర్లు, పాత బ్యాటరీలు, ఇతర వాహన విడిభాగాలను హేమచంద్రపురం నందుగల పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో బహిరంగ వేలంపాట నిర్వహిస్తామని, వేలంపేటలో పాల్గొనడానికి ఆసక్తిగలవారు 30వ తేదీ ఉదయం 9 గంటలకు హేమచంద్రపురం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు రావాలని కోరారు. ఇతర వివరాలకు 8712682145 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## ఆసరా పెన్షన్ లబ్ధిదారులు లైవ్ అథెంటికేషన్ చేయించుకోవాలి

*** మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి.**



జనగామ, ప్రజాస్ఫూర్తి: రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పెన్షన్ లబ్ధిదారుల వివరాలను నవీకరించే ప్రక్రియను చేప ట్టింది. వృద్ధాప్య, వితంతు, వికలాంగు లు, ఒంటరి మహిళలు, చేనేత,కల్లుగీత కార్మికులు, ఎయిడ్స్ బాధితులు,డయా లసిస్ రోగులు తదితరులు పొందుతు న్న ఆసరా పెన్షన్‌లకు సంబంధించి లైవ్ అథెంటికేషన్, ఆధార్ వెరిఫికేషన్ నిర్వ హిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని మున్సి పల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణం లోని అన్ని వార్డుల్లో స్థానిక వార్డు అధికారులు చేపడుతు న్నారు. మూడవ వార్డు లో అ వార్డు ఆఫీసర్ నిఖిల్ రెడ్డి ఆధ్వర్యంలో గత వారం రోజులుగా పెన్షన్ లబ్ధి దారుల లైవ్ ఫోటోగ్రాఫ్, ఆధార్ అథెంటికేషన్ ప్రక్రియ కొనసాగు తోంది. ఇప్పటివరకు సుమారు 80 శాతం వెరిఫికేషన్ పూర్త యిందని అధికారులు తెలిపారు. ఇంకా వెరిఫికేషన్ చేయించుకోని పెన్షన్ లబ్ధిదారులు వెంటనే తమ వివరాలను నమోదు చేయించు కోవాలని సూచిం చారు. లైవ్ అథెంటికేషన్ చేయించు కోకపోతే ప్రభుత్వం పెన్షన్ నిలిపివేసే అవకాశం ఉందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మూడవ వార్డు కౌన్సిలర్ బూడిద జ్యోతి, సీపీఎం శాఖ కార్యదర్శి గుండు శశిరేఖ, ఎం.వాణి, పెన్షన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో రెబ్బెన హెడ్ కానిస్టేబుల్ దుర్మరణం



ప్రజా స్ఫూర్తి, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా: రెబ్బెన మండలంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మండల పరిధిలోని పులికుంట వద్ద జరిగిన ఒక ఘోర రోడ్డు ప్రమాదంలో రెబ్బెన పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న జాడి బాబురావు అక్కడికక్కడే మృతి చెందారు. విధి నిర్వహణలో భాగంగా వెళ్తుండగా ఈ ప్రమాదం సంభవించినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను సేకరించారు. బాబురావు మృతితో రెబ్బెన పోలీస్ స్టేషన్‌లో విషాద ఛాయలు అలముకున్నాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

## సిద్దాపూర్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా ఉద్రిక్తత

*** రైతుల ఆందోళనకు మద్దతు తెలిపిన బిజెపి నేత విష్ణువర్ధన్ రెడ్డి**



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : షాద్‌నగర్ నియోజకవర్గం కొత్తూరు మండలం సిద్దాపూర్ గ్రామంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు ప్రతిపాదన తీవ్ర ఉద్రిక్తతకు దారితీస్తోంది. దీనిని ఏర్పాటు చేయకూడదని గ్రామస్తులు, రైతులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్ యార్డ్ వస్తే ప్రజల ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా, భూగర్భ జలాలు కలుషితమవుతాయని వారు ఆందోళన చెందుతున్నారు. ఈ నిరసన కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొని, రైతులకు తన మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "పరిశ్రమలు వస్తే యువతకు ఉద్యోగాలు లభిస్తాయని, ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఆశించి రైతులు తమ భూములను ప్రభుత్వానికి ఇచ్చారు. కానీ, ఇప్పుడు అదే భూముల్లో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడం దురదృష్టకరం" అని విమర్శించారు. సిద్దాపూర్ గ్రామస్తుల్లో నెలకొన్న భయాందోళనలను తాను స్వయంగా గమనించానని, తమ పిల్లల భవిష్యత్తు కోసం ఇచ్చిన భూముల్లో కాలుష్యాన్ని తెస్తున్నారని ప్రజలు ఆవేదన చెందుతున్నారని తెలిపారు. "ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ గ్రామంలో డంపింగ్ యార్డును అనుమతించేది లేదు" అని రైతులు స్పష్టం చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సమస్యపై ఇప్పటికే స్థానిక పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణతో చర్చించానని, ఆమె ఢిల్లీ పర్యటన ముగించుకుని రాగానే, ఈ అంశంపై పెద్ద ఎత్తున పోరాటం చేపడతామని విష్ణువర్ధన్ రెడ్డి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, చేగు సుధాకర్, మండల అధ్యక్షులు అత్తాపురం మహేందర్ రెడ్డి, నల్లవోలు ప్రతాప్ రెడ్డి, కుడుముల బాల్ రాజ్, కిట్టు యాదవ్, శ్రీధర్ చారి, కొండల్ చారి, క్యామ మహేష్, మంగ విజయ్, నర్సింహ్మా, వెంకటేష్, నరేందర్ రెడ్డి, జైపాల్ కాంత రెడ్డి, నవీన్, నార్య నాయక్, గోవర్ధన్ రెడ్డి, వంశీ చారి, వేణు మహేందర్, భరత్, అక్బర్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్, హరీష్ రావులపై మైనంపల్లి తీవ్ర విమర్శలు

*** మల్కాజిగిరి కాంగ్రెస్ శ్రేణుల గర్జన**



మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి : ఆనంద్‌బాగ్‌లోని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. సమావేశానికి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఏఐసీసీ సభ్యులు , మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ముఖ్య అతిథులుగా హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని నూతన డివిజన్ అధ్యక్షుల నియామకాలను ప్రకటించారు. ముఖ్యంగా యువతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ కమిటీలను రూపొందించారు.ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు బీఆర్ఎస్ పార్టీ, ఆ పార్టీ అగ్రనాయకత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని చెప్పి మోసం చేసిన చరిత్ర మాజీ సీఎం కేసీఆర్‌ది అని , గత ప్రభుత్వంలో బావబామ్మర్దులైన కేటీఆర్, హరీష్ రావులు వేల కోట్ల రూపాయలు సంపాదించి ఇప్పుడు ఆ డబ్బుతో సోషల్ మీడియాలో ట్రోలింగ్ బ్యాచ్‌లను పెంచిపోషిస్తూ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు చేయిస్తున్నారు అని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దళితబంధు పేరుతో దళితులను మోసం చేసింది. గత ప్రభుత్వం చేయని అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి కార్యకర్త గడప గడపకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి పరిధిలోని మొత్తం 16 కార్పొరేటర్ స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కష్టపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, నూతన డివిజన్ అధ్యక్షులు మరియు భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరపాలి

*** రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి**



రంగారెడ్డి జిల్లా, ప్రజాస్ఫూర్తి : అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలోనిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (101) ఫిర్యాదులు అందాయి.ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ శాఖ-37, ఇతర శాఖలు 64 , మొత్తం దరఖస్తులు 101 అందాయి.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కిరణ్మయి (లోకల్ బాడీస్) వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీకి చిక్కిన పాలకుర్తి ఇరిగేషన్ డీ.ఈ శ్రీకాంత్

*** రూ.50 వేల లంచం తీసుకుంటుండ గా పట్టివేత.**



జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా లోని పాలకుర్తి ఇరిగేషన్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న డీ.ఈ శ్రీకాంత్ ఏసీబీ అధికారులకు చిక్కారు. హన్మ కొండ భవానీ నగర్ లోని తన నివాసం లో రూ. 50 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. అధికారిక పనులు నిర్వహించేందుకు లంచం డిమాండ్ చేసినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు వల పన్ని దాడులు చేపట్టారు. లంచం స్వీకరిస్తున్న సమ యం లో శ్రీకాంత్ ను అదుపులోకి తీసుకుని నగదును స్వాధీనం చేసుకు న్నారు. ఈ ఘటన పై కేసు నమోదు చేసి విచారణ కొనసాగి స్తున్నట్లు ఏసీబీ డీఎస్పీ సాంబ య్య తెలిపారు.

## రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల నిర్వహణ పై సమీక్ష




ప్రజా స్ఫూర్తి, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా: రెబ్బెన మండలం గోలేటి లోని జనరల్ మేనేజర్ కార్యాలయం ఆవరణలో జనరల్ మేనేజర్ ఎం విజయ భాస్కర రెడ్డి అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల నిర్వహణ పై అన్ని విభాగాల అధిపతులతో సమావేశం సోమవారం సాయంత్రం నిర్వహించారు. పన్నెండవ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆయన అన్నారు. జూన్ 2 వ తేదీ న నిర్వహించనున్న వేడుకల ఎజెండా, నిర్వహణ బాగుండాలని ఆదేశించారు. వేడుకల కోసం శ్రీ భీమన్న మైదానం, జనరల్ మేనేజర్ కార్యాలయాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఖైరిగుర పిఓ మచ్చగిరి నరేందర్,ఏరియా ఇంజినీర్ కృష్ణ మూర్తి, డివై సీఎమ్ఓ పాండురంగా చారి, డీజీఎం ఐఈడి ఉజ్వల్ కుమార్ బెహరా, పర్సనల్ హెచ్ ఓ డి రాజేశ్వర్ రావు అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో అలసత్వం వద్దు


*** అధికారులకు కలెక్టర్ రాహుల్ శర్మ హెచ్చరిక**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : జిల్లాలో ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు వేగంగా స్పందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ స్పష్టం చేశారు. ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుండి మొత్తం 40 దరఖాస్తులను కలెక్టర్ స్వీకరించారు. అందిన ప్రతి వినతిని నిర్దిష్ట కాలపరిమితిలోగా పరిష్కరించేలా తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు సమయపాలనతో కూడిన సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజావాణికి వచ్చిన ప్రతి దరఖాస్తును అధికారులు వ్యక్తిగతంగా పరిశీలించాలని, ఆయా శాఖలకు వెంటనే ఎండార్స్‌మెంట్ లు జారీ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ప్రతి దరఖాస్తును ప్రజావాణి పోర్టల్‌లో నమోదు చేసి, దరఖాస్తుదారులకు తప్పనిసరిగా రశీదు అందజేయాలని సూచించారు. దీని ద్వారా సమస్యల పరిష్కారంలో పారదర్శకత పెరుగుతుందని చెప్పారు. అలాగే దరఖాస్తుల పరిష్కారానికి సంబంధించి అధికారులు తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. బాధితులకు న్యాయం చేయడంలో నిర్లక్ష్యం వహించినా, కాలయాపన చేసినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

## ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కారం కావడం లేదు

*** ఆర్డీవో కార్యాలయం ఎదుట ఫిర్యాదుదారుల నిరసన..**




హుస్నాబాద్ , ప్రజాస్పూర్తి :ప్రజా సమస్యలు పరిష్కరించని యెడల ప్రజావాణి ఎందుకు నిర్వహిస్తున్నారని,ఆరోపిస్తూ ఫిర్యాదుదారులు ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. సంవత్సరాలు గడుస్తున్న సమస్యలకు ఇప్పటికి పరిష్కారం కాకపోవడం సిగ్గు చేటని జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఆర్డీవో కార్యాలయంలో ప్రజావాణి నిర్వహిస్తే ప్రజా సమస్యలు పరిష్కారం అయితాయంటే ఏమాత్రం కూడా పరిష్కార కావడం లేదని, ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను చెత్తబుట్టలో వేసే విధంగా ఉన్నాయని, ఎంతోమంది డివిజన్ నుండి హుస్నాబాద్ కు కష్టపడి ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని వస్తే ఇప్పటివరకు కూడా సంవత్సరాలు గడుస్తున్న పరిష్కారం కాలేదని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజా సమస్య ప్రజావాణిలో ఇస్తే అధికారులు జవాబు దారి తనం ఉండాలని చెప్పినారు కానీ ఇప్పటివరకు అధికారుల యొక్క జవాబు లేదు పరిష్కారం లేదు కాబట్టి వెంటనే ప్రజావాణిని చిత్తశుద్ధితో నిర్వహిస్తే ప్రజావాణి నడపాలని లేకుంటే ప్రజావాణిని తీసివేయాలని ఫిర్యాదుదారులు డిమాండ్ చేస్తున్నారు.రాష్ట్ర మంత్రి ప్రభాకర్ పట్టించుకోని వెంటనే ప్రజల సమస్యలు పరిష్కరించాలని కిసాన్ సంఘ్ డివిజన్ అధ్యక్షులు కవ్వ వేణుగోపాల్ రెడ్డి ఫిర్యాదుదారుల తరపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## సమస్యల పరిష్కారానికి వేదిక ప్రజావాణి

**: జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



జనగామ, ప్రజాస్పూర్తి : జిల్లా ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్క రించేందుకే ప్రజావాణి కార్యక్రమం నిర్వ హిస్తున్నామని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ బెన్షాలోమ్ తో కలిసి ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్జీ దారుల నుంచి వచ్చిన వినతులను స్వీకరించిన కలెక్టర్, సమస్యల పై అధి కారులు వెంటనే స్పందించి తగిన చర్య లు తీసుకోవాలని ఆదేశించారు. ఈ గ్రీవెన్స్ లో మొత్తం 550 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు.ప్రజావాణిలో దివ్యాంగుడైన కంకల రాజమల్లయ్య కు ప్రభుత్వం తరపున ఉచితంగా మూడు చక్రాల మోటరైజ్డ్ స్కూటీ అందజేశారు. సాయి నగర్‌కు చెందిన రాజ మల్లయ్య నడవడంలో ఇబ్బందులు ఎదుర్కొం టూ ప్రజావాణి లో వాహనం మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు అర్జీని పరిశీలించి వికలాం గుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్కూటీ మంజూరు చేసి, కలెక్టర్, అదనపు కలెక్ట ర్ చేతులమీదుగా వాహనం తాళాలను అందజేశారు.ఇప్పటి వరకు ప్రయాణాల కోసం ఇతరుల పై ఆధారపడాల్సి వచ్చే దని, ఇక పై తన పనులు తాను చేసుకోనే అవకాశం లభించిందని రాజ మల్లయ్య ఆనందం వ్యక్తం చేస్తూ అధి కారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రంగారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## దళితవాడకు వాటర్ ట్యాంకు ఏర్పాటు చేయాలని కలెక్టర్ కు వినతి



మహబూబాబాద్, ప్రజాస్పూర్తి : మహబూబాబాద్ మున్సిపాలిటీ 6వ వార్డు బేతోలు గ్రామంలో ఉన్న దళితవాడకు గత కొన్ని సంవత్సరాలుగా మురికి నీరే త్రాగునీరుగా ఉంది. ఈ గ్రామంలో రెండు వాటర్ ట్యాంకులు ఉండగా ఒక వాటర్ ట్యాంక్ బిసి కాలనీలో మరో వాటర్ ట్యాంక్ అన్ని వర్గాలు నివాసముండే చోట ఉంది. మిషన్ భగీరథ ద్వారా స్వచ్ఛమైన నీటిని ఈ రెండు వాటర్ ట్యాంకుల ద్వారా గ్రామంలోని ప్రజలకు తాగునీరు అందిస్తున్నారు. ఈ గ్రామంలోనే ఉన్న దళితవాడకు మాత్రం ఎలాంటి పైపులైను నిర్మాణం చేయలేదు. ఆపై వాటర్ ట్యాంక్ కూడా ఏర్పాటు చేయలేదు. దళితవాడకు చెందిన ఎస్సీలు తమ దళిత వాడకు తాగునీరు అందించాలని మిషన్ భగీరథ పైపులు వేసి ఆపై వాటర్ ట్యాంక్ నిర్మాణం చేసి స్వచ్ఛమైన నీటిని అందించాలని అనేక సార్లు మున్సిపాలిటీ అధికారులకు విన్నవించుకున్నప్పటికీ నేటికీ సమస్యకు పరిష్కారం కాలేదు దీంతో మిషన్ భగీరథ నీరు రాక గతంలో ఎప్పుడో వెంకటేశ్వర కుంట చెరువులో నాచు పేరుకుపోయి ఉన్న బావి నీరు ఈ దళిత వాడకు ఆధారం. ఈ చెరువులో ఉన్న బావి నీరు పూర్తిగా కలుషితమై మురికి నీరుగా ఉన్న కూడా ఈ మురికి నీరే దళితవాడ తాగునీరుగా మారింది. ఎర్ర కుంట చెరువులో కూడా ఓ బావి ఉన్నప్పటికి ఆ బావి నీరు మొత్తం అడుగంటిపోయింది. దళిత వాడలోని ప్రజలు త్రాగునీటి కోసం చాలా దుర్భరమైన పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రజలు మంచినీటి కోసం చాలా సమయం వేచి చూసి మంచి నీటిని తెచ్చుకోవాల్సి వస్తుంది. కలుషిత బావి నీటిని తాగడం వలన పెద్దలు, పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారు. దళిత వాడకు వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేసి మిషన్ భగీరథ ద్వారా మాకు మంచి నీటి సౌకర్యాన్ని కల్పించాలని కోరుతున్నాం.

# బెలిదే శ్రీనివాసును అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిపించాలి

*** మున్సిపల్ చైర్ పర్సన్ నివేదిత లక్షాధి**



ప్రజాస్పూర్తి, సూర్యాపేట: సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా పోటి చేస్తున్న బెలిదే శ్రీనివాసును అత్యధిక ఓట్లతో గెలిపించాలని మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి అన్నారు. ఆదివారం రాత్రి సూర్యాపేట జిల్లా కేంద్రం రవి మహల్ లో బెలిదే శ్రీనివాసులు మద్దతుగా ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమావేశంలో బెలిదె శ్రీనివాసులు యొక్క ఎన్నికల మేనిఫెస్టో ను మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది ఆవిష్కరించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో పేద మధ్యతరగతి , ఆర్యవైశ్యుల కోసం , విద్యార్థులు, మహిళల కోసం అనేక పధకాలు ప్రకటించారని అన్నారు. ఈ మేనిఫెస్టో అమలు కావడానికి బెలిదె శ్రీనివాసులు కు ప్రతి ఒక్కరూ ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. స్వంత స్థలం వున్న ఆర్యవైశ్యులు ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమం లో బెలిదె శ్రీనివాసులు మాట్లాడుతూ ఆర్యవైశ్య సమాజ అభివృద్ధికి కట్టుబడి వున్నానని తెలిపారు. సూర్యాపేట పట్టణంలో ఆర్యవైశ్యుల కోసం కర్మకాండ భవనం నిర్మాణం, అంబులెన్స్ సౌకర్యం, పేద కుటుంబాల వివాహాలకు సహాయం, ఉచిత ఫ్రీజర్ బాక్స్, మహిళలకు బోటిక్, కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు వంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. పేద విద్యార్థులకు విద్యా సహాయం, ప్రతిభ కనబరిచిన వారికి సన్మానం, వ్యాపారులకు రుణ సదుపాయం, మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలనే సంకల్పంతో ముందుకు వస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికల బరిలో నిలిచిన మిట్టపల్లి రమేష్ స్నేహ పూర్వక పోటిలో భాగంగా బెలిదె శ్రీనివాసులు కు మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉప్పల సత్యనారాయణ, మొరిశెట్టి కోటేశ్వరరావు, మిట్టపల్లి రమేష్, ఉప్పల శ్రవణ్, రాచకొండ శ్రీనివాస్, చల్లా లక్ష్మి ప్రసాద్, బిక్కుమల్ల కృష్ణ, గుండా వెంకన్న, బొల్లం సురేష్, బోనగిరి కృష్ణ, సోమ వెంకన్న, సోమ ప్రవీణ్ కుమార్, కర్నాటి సురేందర్, ఈగ వెంకటేశ్వర్లు, పోలా రాధాకృష్ణ, కందిబండ ఉమ మహేశ్వరరావు, పెద్దసంఖ్యలో వ్యాపారులు, మహిళలు పాల్గొన్నారు.

## మహిళా వారోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలి

*** జిల్లా కలెక్టర్ కె.హరిత**



ప్రజా స్పూర్తి, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా: ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈనెల 25వ తేదీ నుండి 30వ తేదీ వరకు జిల్లా మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన మహిళ వారోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, జిల్లా సంక్షేమ అధికారి స్వరూపారాణి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్త రావు లతో కలిసి మహిళా వారోత్సవాల సంబంధిత గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 25న గ్రామ సంఘాల భవనాలు, మండల సమాఖ్య భవనాలు, భవనాల భూమి పూజ, శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించడం, అంగన్వాడి టీచర్లు, పిల్లల తల్లిదండ్రుల కోసం వంట పోటీలను నిర్వహించాలని తెలిపారు. 26వ తేదీన "బాల్య వివాహం బ్రతుకు ఆగం" నినాదంతో బాల్య వివాహాల వలన కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, 27వ తేదీన మహిళల భద్రత పోష్ చట్టంపై అవగాహన కల్పించడం, మండల సమాఖ్యలో ప్రత్యేక సాధారణ సమావేశం నిర్వహించాలని తెలిపారు. 29వ తేదీన రుణ మేళాలు నిర్వహించడం, స్వయం సహాయక సంఘాల జీవనోపాధి, యూనిట్ల రౌండింగ్ ప్రారంభించాలని తెలిపారు. 30వ తేదీ చివరి రోజున అమ్మ మాట అంగన్వాడీ బాట నినాదంతో అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు ఏకరూప దుస్తుల పంపిణీ, విద్య ఆరంభ ధ్రువపత్రాల జారీ, కిశోర బాలికల కొరకు స్నేహ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. మహిళా వారోత్సవాల విజయవంతంకి అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సి.డి.పి.ఓ.లు, సూపర్వైజర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి : సంక్షేమ కమిటీ



జనగామ, ప్రజాస్పూర్తి: తెలంగాణ ఆర్టీసీ విశ్రాంత ఉద్యో గుల సమస్యలను తక్షణమే పరి ష్కరించాలని సోమవారం డిపో గేటు ఎదుట కొంత సమయం ధర్నా నిర్వహించి, డిపో మేనేజర్ స్వాతి, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కు సంక్షేమ కమిటీ ప్రతినిధి బృందం వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్‌పీఎస్ - 2017 అమలు, పెండింగ్ బకాయిల చెల్లింపు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, పీఎఫ్, డీడీ బకాయిల సమస్యలను ప్రస్తావించి, ముఖ్య మంత్రి కార్యాలయానికి నివేదించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం వెంటనే ప్రత్యేక దృష్టి సారించి పెండింగ్ చెల్లింపులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వృద్ధాప్యంలో విశ్రాంత ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నందున ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ కమిటీ నాయకులు ఎం.ముత్తయ్య, జి.యాకయ్య, ఎస్.బి.ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## భూముల మార్కెట్ విలువల నవీకరణను
# గడువులోగా పూర్తి చేయాలి

*** కలెక్టర్ చంద్రశేఖర్**



నల్లగొండ, ప్రజాస్పూర్తి : రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం భూముల మార్కెట్ విలువల నవీకరణను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. ఈ ప్రక్రియను బాధ్యతాయుతంగా నిర్వహించాలని చెప్పారు. సోమవారం ఉదయాదిత్య భవనంలో సబ్ రిస్టార్లు, తహసిల్దార్ లు, ఎంపీడీవో లతో భూముల మార్కెట్ విలువల పై సమీక్ష నిర్వహించారు. జీవో నెం.41 ప్రకారం భూముల మార్కెట్ విలువల (మార్కెట్ వాల్యూ) నవీకరణ చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం అర్బన్, రూరల్ కేటగిరీలుగా విభజించి ప్రక్రియ చేపట్టాలన్నారు. ఇందుకు సంబంధించి 1, 2, 3, 4 ఫారమ్‌ల ఆధారంగా ప్రాంతాల వారీగా రహదారులు, మండల కేంద్రాలు, నియోజకవర్గ పరిధులు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని భూముల విలువలను అంచనా వేస్తున్నట్లు చెప్పారు. ల్యాండ్ విలువలను పరిశీలించి ఆర్డీవో స్థాయిలో అప్లోడ్ చేస్తున్నామని, అనంతరం మార్కెట్ విలువలను ఫైనల్ చేసి కమిటీ ఆమోదానికి పంపనున్నట్లు తెలిపారు. అర్బన్ కమిటీలో అదనపు కలెక్టర్ చైర్మన్‌గా ఉండగా, మున్సిపల్ కమిషనర్, జెడ్పీసీఈఓ, సబ్‌రిజిస్ట్రార్ సభ్యులుగా ఉంటారని చెప్పారు. రూరల్ కమిటీలో ఆర్డీవో చైర్మన్‌గా, సబ్ రిజిస్ట్రార్, తహసీల్దార్, ఎంపీడీవో సభ్యులుగా వ్యవహరిస్తారని వివరించారు.నాన్‌అగ్రికల్చర్ ఫిజికల్ కమిటీలలో ఫారమ్ 1, 2లను, అగ్రికల్చర్ కమిటీలలో ఫారమ్ 3, 4లను పూర్తి చేయాల్సి ఉంటుందని తెలిపారు. స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్ల చట్టం ప్రకారం అన్ని వివరాలను సరిచూసుకుని నమోదు చేయాలని సూచించారు. అగ్రికల్చర్ భూములకు కనీస మార్కెట్ విలువ రూ.2.75 లక్షలు, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.5 లక్షలు, హెచ్‌ఎండీఏ పరిధిలో రూ.10 లక్షలు ఉండాలని ప్రభుత్వం నిర్దేశించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, జిల్లా పరిషత్ సిఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, చండూర్ ఆర్డీవో శ్రీదేవి, మిర్యాలగూడ ఆర్డిఓ రమణారెడ్డి, దేవరకొండ ఆర్డిఓ ప్రియదర్శిని, సబ్ రిజిస్ట్రార్లు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహారం ప్రతి మహిళకు చిన్నారులకు చేరాల చర్యలు తీసుకోవాలి

*** కలెక్టర్ బి చంద్రశేఖర్**



నల్లగొండ, ప్రజాస్పూర్తి : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం అర్హులైన ప్రతి మహిళకు, చిన్నారులకు చేరేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. మహిళలు, గర్భిణీలు మరియు చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో పౌష్టికాహారం కీలక పాత్ర పోషిస్తుందని, ప్రతి కుటుంబం ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు అలవరుచుకోవాలని సూచించారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఆయన కలెక్టరేట్ ప్రాంగణంలో మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను ప్రారంభించారు.స్టాల్స్‌లో ప్రదర్శించిన అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన పోషకాహార పదార్థాలను కలెక్టర్ పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందిస్తున్న పోషకాహారంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా గ్రీవెన్స్ డే సందర్భంగా కలెక్టరేట్‌కు వచ్చిన ఒక బాలింత మహిళకు కలెక్టర్ స్వయంగా రాగిజావ అందించారు. మహిళల ఆరోగ్యం, పోషకాహారం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని తెలిపారు.మహిళా సంక్షేమం, పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు మహిళా వారోత్సవాలు దోహదపడతాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.ఈ ఎగ్జిబిషన్‌లో స్థానికంగా లభ్యమయ్యే తక్కువ ఖర్చుతో కూడిన పౌష్టికాహార పదార్థాలు, మిల్లెట్స్ ఆధారిత ఆహార పదార్థాలు మరియు పోషకాహార వంటకాలు ప్రదర్శించబడినవి. ఈ సందర్భంగా అన్ని గ్రామాలలో మండల స్థాయిలో తల్లులు, తండ్రులు, అంగన్‌వాడీ టీచర్లు మరియు హెల్పర్లతో పౌష్టికాహార వంటకాల పోటీలు నిర్వహించారు. గర్భిణీలు బాలింతలకు గర్భధారణ సమయంలో తీసుకోవలసిన పౌష్టికాహారం, రక్తహీనత నివారణ, సమతుల్య ఆహారం, ఆహార వైవిధ్యం జంక్ ఫుడ్ వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. ఆరోగ్య శాఖ సమన్వయంతో గర్భిణీ స్త్రీలకు అనీమియా పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సూచనలు అందించారు. కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై కమ్యూనిటీ న్యూట్రిషన్ ప్రతిజ్ఞ నిర్వహించారు.జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పుట్ల శ్రీనివాస్ , సిపిడిఓలు లావణ్య, నిర్మల, మమత , శ్రీదేవి సూపర్వైజర్లు, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

## మీడియేషన్ న్యాయవాది మల్లారెడ్డికి గుర్తింపు ధ్రువపత్రం



మహబూబాబాద్, ప్రజాస్పూర్తి : మధ్య వర్తిత్వం ద్వారా 10 కేసులను పరిష్కరించిన నేపథ్యంలో మహబూబాబాద్ మీడియేషన్ న్యాయవాది వై. చెన్న మల్లారెడ్డి కి సుప్రీం కోర్టు మీడియేషన్, కన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ గుర్తింపు ధ్రువపత్రం జారీ చేసింది. 10 కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించిన తరువాతే మధ్యవర్తిత్వ న్యాయవాదికి ఈ పత్రాన్ని జారీ చేస్తారు. ఈ ఘనత సాధించిన మల్లారెడ్డి కి సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి మొహమ్మద్ అబ్దుల్ రఫీ ధ్రువీకరణ పత్రాన్ని అందచేశారు.ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి మాట్లాడుతూ మధ్యవర్తిత్వము లేదా లోక్ అదాలత్ ద్వారా కేసులు రాజీమార్గంలో పరిష్కరించబడినట్లయితే ఇరుపక్షాలు కేసు గెలిచినట్లేనని ఈ విధంగా రాజీ దిశగా ఇరుపక్షాలని ప్రోత్సహించటంలో శిక్షణ పొందిన మధ్యవర్తులు చురుకైన పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మధ్యవర్తిత్వ న్యాయవాదులు మల్లారెడ్డి, బి కృష్ణ, బి. శ్రీనివాస్, టి. సైదులు తదితరులు పాల్గొన్నారు.

# హత్యాచార కేసులో రెండు మరణశిక్షలు..పోక్సో కోర్టు కీలక తీర్పు

తమిళనాడులోని విలాతికుళం ప్రాంతానికి చెందిన 12వ తరగతి విద్యార్థిని హత్యాచారం కేసులో పోక్సో కోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులో దోషిగా తేలిన ధర్మ మునీశ్వరన్‌కు రెండు మరణ శిక్షలు విధించింది. చిన్నారిపై అత్యాచారానికి పాల్పడమే కాకుండా అతి దారుణంగా ప్రవర్తించినందుకు గానూ.. ఈ శిక్షలు విధిస్తున్నట్లు వెల్లడించింది. గతంలోనూ పలు నేరాల్లో అతడి ప్రమేయం ఉన్నట్లు విచారణలో వెల్లడైనట్లు తెలిపింది. దీనిని అరుదైన కేసుగా పేర్కొంది.

**ఏమిటీ కేసు..?**

విలాతికుళం సమీపంలోని వేదనాథం గ్రామానికి చెందిన 12వ తరగతి విద్యార్థిని మార్చి 10వ తేదీ సాయంత్రం నుంచి కనిపించలేదు. ఆమె తల్లిదండ్రులు పోలీసుస్టేషన్‌కు వెళ్లగా ఫిర్యాదు తీసుకోవడంలో జాప్యం చేశారు. మరుసటి రోజు వేదనాథం అటవీ ప్రాంతంలో తీవ్రమైన గాయాలతో బాలిక మృతదేహం లభ్యమైంది. పోలీసుల నిర్లక్ష్యం వల్లే తమ కుమార్తె ప్రాణాలు కోల్పోయిందని ఆమె తల్లిదండ్రులు ఆరోపించారు. దీంతో ఉన్నతాధికారులు



విలాతికుళం ఇన్‌స్పెక్టర్ ప్రవీణను సస్పెండ్ చేశారు. ఈ కేసుపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా మార్చి 19న సాయల్గుడికి చెందిన ధర్మను అరెస్టు చేశారు. నాటి నుంచి కేసుపై దర్యాప్తు కొనసాగుతోంది. కాగా గతంలోనూ ఓ వృద్ధురాలిపై హత్యాచారానికి పాల్పడినట్లు నిందితుడిపై కేసు ఉందని బాధితుల తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థినిపై హత్యాచారానికి పాల్పడిన సమయంలో అతడు ఆ కేసులో బెయిల్‌పై బయట ఉన్నట్లు తెలిపారు.

## ముగ్గురు అన్నాడీఎంకే ఎమ్మెల్యేల రాజీనామా



తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం చవిచూసిన అన్నాడీఎంకేకు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. సోమవారం ఆ పార్టీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు రాజీనామా చేసి, ఆ తర్వాత టీవీకే మంత్రి ఆదవ్ అర్జునను కలిశారు. మరగతం కుమారవేల్, జయకుమార్, సత్యభామ తమ రాజీనామా లేఖలను అసెంబ్లీ స్పీకర్ జేసీడీ ప్రభాకర్‌కు సమర్పించారు. ఇటీవల తమిళనాడు అసెంబ్లీలో జరిగిన బలపరీక్షలో టీవీకే ప్రభుత్వానికి.. సీవీ షణ్ముగం నేతృత్వంలో 20 మందికి పైగా అన్నాడీఎంకే అసమ్మతి ఎమ్మెల్యేలు మద్దతు ఇచ్చిన సంగతి తెలిసిందే. వారిలో ఇప్పుడు రాజీనామా చేసిన వారు కూడా ఉన్నారు. దీంతో మదురాంతకం, ధారాపురం, పెరుందురై నియోజకవర్గాలు ఖాళీ అయ్యాయి. ఇప్పుడు మళ్లీ అక్కడ ఉప ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. మాజీ సీఎం పళనిస్వామి నేతృత్వంలోని అన్నాడీఎంకే అసెంబ్లీ ఎన్నికల్లో 47 స్థానాలు మాత్రమే గెలుచుకుంది. వరుసగా రెండోసారి అధికారానికి దూరం కావడంతో పార్టీ నేతల్లో అసంతృప్తి వ్యక్తమైంది. దాంతో విజయ్‌కు మద్దతు ఇచ్చే విషయంలో పార్టీ రెండుగా చీలిన సంగతి తెలిసిందే.

## ఫ్యామిలీ ట్రిప్ ముసుగులో.. ప్రభుత్వ భవనాల వద్ద రెక్కీ..!

ఎర్రకోట సమీపంలో కారు బాంబుతో ఆత్మాహుతికి పాల్పడిన ఘటనకు సంబంధించి జాతీయ దర్యాప్తు సంస్థ న్యాయస్థానంలో ఛార్జిషీట్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా కొన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఎర్రకోట వద్ద పేలుడు ఘటనలో నిందితులుగా ఉన్న ఉగ్ర డాక్టర్లే లఖ్‌నవూలోని ప్రభుత్వ భవనాలను లక్ష్యంగా చేసుకునేందుకు కుట్ర పన్నారని పేర్కొంది. డాక్టర్ ముజమ్మిల్ షకీల్, డాక్టర్ షహీన్ సయీద్ లఖ్‌నవూలో దాడికి కుట్రలో భాగంగా గతేడాది ఆగస్టులో నెలలో రెక్కీ నిర్వహించారు. ఏయే భవనాలను టార్గెట్ చేయాలి.. లాజిస్టిక్స్ అవకాశాలు ఎలా ఉన్నాయని వీరిద్దరూ పరిశీలించినట్లు ఎన్‌ఐఏ వెల్లడించింది. ఈ రెక్కీలో భాగంగా ఫరీదాబాద్ నుంచి లఖ్‌నవూకు వెళ్లినవారు.. ఆ పర్యటనకు ఫ్యామిలీ ట్రిప్ అనే ముసుగువేశారని పేర్కొంది. అది వ్యక్తిగత పర్యటన కాదని, భవిష్యత్‌లో భారీ దాడులకు ప్లాన్ చేసిన ఆపరేషన్‌లో భాగమని ఎన్‌ఐఏ తెలిపింది. ఆ ట్రిప్‌లో భాగంగా బంధువుల ఇళ్లలో బస చేశారని.. వారు నగరంలో ఉన్న సమయంలో ఆ నివాసాలను స్థావరంగా




వాడుకున్నారని ఆరోపించింది. మదర్ ఆఫ్ సైతాన్'గా పిలిచే ట్రైఅసిటోన్ ట్రైఫెరాక్సైడ్ అత్యంత ప్రమాదకరమైన పేలుడు పదార్థం. దాని ముడిపదార్థాల కోసం లఖ్‌నవూలోని రసాయన దుకాణాల గురించి ముజమ్మిల్ ఆన్‌లైన్‌లో వెతికినట్లు అధికారులు గుర్తించారు. ఆ వివరాలన్నీ ఆమె చేతితో రాసుకోవడంతో పాటు ఆ పదార్థాలను ఒకేసారి భారీగా సేకరించడం వీలవుతుందా, లేదా..? అని స్థానికుల వద్ద సమాచారం సేకరించినట్టు పేర్కొన్నారు. ఇక వీరు రెక్కీ నిర్వహించిన విధాన సభ రోడ్‌లో ప్రభుత్వ భవనాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఆ ప్రాంతంలో ప్రజల కదలికలు, భద్రతా ఏర్పాట్లు, ఏ రూట్ నుంచి వెళ్లాలనే వివరాలను కాలినడకన వెళ్లి ముజమ్మిల్ సర్వే చేసినట్లు పేర్కొన్నారు. షహీన్ మొబైల్ లొకేషన్ డేటా కూడా వారి ట్రిప్‌ను బలపరిచే ఆధారంగా మారిందని తెలుస్తోంది. 2025 నవంబరు 10న ఎర్రకోటకు సమీపంలో కారు బాంబు పేలుడు ఘటన యావత్ దేశాన్ని కలవరపాటుకు గురిచేసిన విషయం తెలిసిందే. దానికి ముందు ఈ రెక్కీ జరిగినట్లు తాజా ఛార్జిషీట్ ప్రకారం తెలుస్తోంది.

## కేబుల్ కార్ సర్వీసుల్లో సాంకేతిక లోపం.. గాల్లోనే 300మంది పర్యాటకులు

కేబుల్ కార్ సర్వీసుల్లో అంతరాయం నెలకొనడంతో 300మంది పర్యాటకులు గాల్లోనే చిక్కుకుపోయిన ఘటన జమ్మూ కశ్మీర్‌లో చోటుచేసుకుంది. గుల్మార్గ్‌లోని గోండోలాలో పర్యాటకులకు కేబుల్ కార్ సర్వీసులు ఉంటాయి. సోమవారం పర్యాటకులు కేబుల్ కార్లలో ప్రయాణిస్తుండగా సాంకేతిక లోపం తలెత్తడంతో అవి గాల్లోనే ఆగిపోయాయి. దీంతో పర్యాటకులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. కొన్ని గంటలపాటు 300మంది ప్రయాణికులు గాల్లోనే ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.



ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆర్మీ, సహాయక బృందాల సాయంతో పర్యాటకులను కేబుల్ కార్ల నుంచి సురక్షితంగా కిందకు దించుతున్నట్లు తెలిపారు. కేబుల్ కార్ వ్యవస్థ పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయన్నారు. సాంకేతిక లోపానికి గల కారణాలపై దర్యాప్తు కొనసాగుతోందన్నారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలు ముమ్మరం చేయాలని జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అధికారులను ఆదేశించారు.

## నీట్ పేపర్ లీక్.. ఎన్‌టీఏ పాఠాలు నేర్చుకోలేదు: సుప్రీం అసహనం

దేశవ్యాప్తంగా దుమారం రేపిన నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్ని ఆదేశాలు జారీ చేసినా.. గత పేపర్ లీక్ (NEET Paper Leak) ఘటనల నుంచి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (NTA) ఎలాంటి పాఠాలు నేర్చుకోలేదని అత్యున్నత న్యాయస్థానం (Supreme Court) అసహనం వ్యక్తంచేసింది. ఈ వ్యవహారంపై ఎన్‌టీఏతో పాటు కేంద్రం, సీబీఐకి నోటీసులు జారీ చేసింది. ఈ ఏడాది మే 3వ తేదీన దేశవ్యాప్తంగా జరిగిన నీట్ యూజీ 2026 పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రం లీకవడం వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. అంతకుముందు 2024లోనూ ఈ పరీక్ష పేపర్ లీక్ చోటుచేసుకుంది. దీంతో ఏటా ఈ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తోన్న ఎన్‌టీఏపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే వైద్య విద్య



ప్రవేశపరీక్ష నిర్వహణ కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి బదులుగా ఓ స్వతంత్ర సంస్థను ఏర్పాటుచేయాలని కోరుతూ ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై సోమవారం విచారణ జరిపిన న్యాయస్థానం.. ఎన్‌టీఏ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది. ''ఎన్‌టీఏ తమ వైఫల్యాల నుంచి ఎలాంటి పాఠాలు నేర్చుకోకపోవడం విచారకరం. ఈ అంశం (2024 పేపర్ లీక్ ఘటనను ప్రస్తావిస్తూ) గతంలోనూ సుప్రీంకోర్టును చేరింది. అప్పుడు మానిటరింగ్ కమిటీని ఏర్పాటుచేశాం. ఆ కమిటీ కొన్ని ప్రతిపాదనలు చేయగా.. వాటిని ఎన్‌టీఏ అంగీకరించింది. మరి వాటి అమలు కోసం ఎలాంటి చర్యలు చేపట్టారో మేం తెలుసుకోవాలనుకుంటున్నాం. ఆ వివరాలకు సంబంధించి గురువారం లోగా అఫిడవిట్ దాఖలు చేయండి'' అని ధర్మాసనం ఎన్‌టీఏను ఆదేశించింది. దీంతో పాటు ఈ పిటిషన్‌పై తమ స్పందన తెలియజేయాలంటూ కేంద్రం, సీబీఐకి కూడా సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది

## ట్విష మృతి కేసు.. ఆ ప్రచారం ఆందోళనకరం: సుప్రీంకోర్టు

నోయిడాకు చెందిన ట్విషా శర్మ మృతి కేసును సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు.. సోమవారం విచారణ చేపట్టింది. ఈసందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. ఆమె మృతి చుట్టూ జరుగుతోన్న ప్రచారం ఆందోళనకరమని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఈ కేసు రిపోర్టింగ్ విషయంలో మీడియా సంయమనం పాటించాలని సూచించింది. న్యాయవ్యవస్థ విచారణను ఆలస్యం చేస్తోందన్న వ్యాఖ్యలు విచారకరమంది. అలాగే ఈ కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించడం సరైన చర్యేనని అభిప్రాయపడింది. మే నెల ప్రారంభంలో భోపాల్‌లోని అత్తింట్లో ట్విష అనుమానాస్పద రీతిలో ప్రాణాలు కోల్పోయింది. అప్పటికి ఆమెకు పెళ్లై ఐదు నెలలే. మృతి చెందడానికి ముందు తన తల్లి, స్నేహితురాలికి ఆమె పలు సందేశాలు పంపినట్లు తెలుస్తోంది. తాను వేధింపులకు గురవుతున్నానని, మానసిక క్షోభ అనుభవిస్తున్నానని, తన జీవితం నరకంలా మారిందని, తాను ఈ వివాహ బంధంలో చిక్కుకుపోయానని వాటిల్లో పేర్కొన్నట్లు వార్తలు వచ్చాయి. దాంతో ఈ కేసు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ట్విష భర్త లాయర్. అత్త విశ్రాంత న్యాయమూర్తి. వరకట్నం కోసం వారు వేధించారని, ఆత్మహత్యకు పురిగొల్పారని, అలాగే ఈ కేసును ప్రభావితం చేస్తున్నారంటూ మృతురాలి కుటుంబసభ్యులు ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే ఈ కేసును సుప్రీంకోర్టు (Supreme Court) సుమోటోగా స్వీకరించింది. మధ్యప్రదేశ్ హైకోర్టు వెంటనే రెండోసారి శవ పరీక్షకు ఆదేశించడాన్ని ఈ విచారణ సందర్భంగా సుప్రీం ప్రశంసించింది. ''ఒక దురదృష్టకర ఘటన జరిగింది. బాధ్యులను



గుర్తించే విషయంలో నిష్పక్షపాత విచారణ జరగాలి. ఈ కేసు రిపోర్టింగ్ విషయంలో మీడియా సంయమనం పాటించాలి. అలాగే నిందితులు, సాక్షులు మీడియా ఎదుట బహిరంగ ప్రకటనలు చేయొద్దు. మృతురాలి అత్త మాజీ న్యాయమూర్తి. ఆ కారణంతో విచారణ పట్టాలు తప్పుతోందని వ్యాఖ్యానించడం దురదృష్టకరం. ఆ కథనాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. అందుకే ఈ కేసును సీబీఐ చేపట్టాలి'' అని సుప్రీం వ్యాఖ్యానించింది. మధ్యప్రదేశ్ ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. ఈ కేసు ఆడపిల్లలు ఉన్న తల్లిదండ్రులకు ఒక సందేశమన్నారు. ఇలాంటి దురదృష్టకర ఘటనను ఎదుర్కోవడం కంటే ఆ కుమార్తెకు విడాకులు ఇప్పించడమే మంచిదని వ్యాఖ్యానించారు. కాగా.. తెలుగులో 2021లో వచ్చిన 'ముగ్గురు మొనగాళ్లు' చిత్రంలో ట్విష నటించారు. పలు బ్రాండ్లకు ప్రచారకర్తగానూ వ్యవహరించారు.

## ప్రజల సేవింగ్స్ తగలబెట్టడానికి పెట్రోల్ చల్లుతున్నారు: కేంద్రంపై ఖర్గే ఫైర్

దేశంలో రోజురోజుకు పెరుగుతోన్న ఇంధన ధరలపై కాంగ్రెస్ చీఫ్ ఖర్గే ఆందోళన వ్యక్తంచేశారు. ఈ రోజూవారీ దోపిడీ వల్ల ఎవరు లాభపడుతున్నారని ప్రశ్నించారు. సామాన్యుల పొదుపును తగలబెట్టడానికి మోదీ ప్రభుత్వం పెట్రోల్ చల్లుతోందని విమర్శించారు. 2014లో రూ.71.41 ఉన్న లీటర్ పెట్రోల్ ధరను మోదీ సర్కారు 2026 నాటికి రూ.102.12కు చేర్చిందని ఎద్దేవా చేశారు. రెండు వారాల లోపే పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం ఇది నాలుగోసారి అని.. ఈ రోజువారీ ఇంధన దోపిడీ ఇంకా ముగిసిపోలేదన్నారు. గత 12 ఏళ్లలో మోదీ ప్రభుత్వం ఇంధనంపై రూ.43 లక్షల కోట్లు దోచుకుందని దుయ్యబట్టారు. పెట్రోల్, డీజిల్ ధరలు నాలుగోసారి పెరగడంతో ఈరోజు హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐఓసీ షేర్లు వరుసగా 5.8, 4.44, 3.90 శాతం పెరిగాయన్నారు. ప్రజల అవసరాల కంటే లాభానికే ప్రాధాన్యం ఇవ్వడం భాజపా



నైజమన్నారు. ఇంధన ధరల పేరుతో రైతుల నుంచి ఎంఎస్‌ఎంఈల వరకు, సమాజంలోని ప్రతి వర్గం భాజపా దోపిడీ భారాన్ని మోస్తోందన్నారు. దేశవ్యాప్తంగా నేడు మరోసారి భారీగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. లీటర్ పెట్రోల్‌పై రూ.2.84, డీజిల్‌పై రూ.2.86 చొప్పున ప్రభుత్వ రంగ చమురు సంస్థలు పెంచాయి. పెంచిన ధరలు ఇవాళ ఉదయం 6 గంటల నుంచి అమల్లోకి వచ్చాయి. కాగా ఇప్పటికే మూడు విడతలుగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచిన విషయం తెలిసిందే. దీంతో దిల్లీలో పెట్రోల్ ధర రూ.102.12, డీజిల్ రూ.95.20కు చేరింది. హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.115.58, డీజిల్ ధర రూ.103.74గా ఉంది.

## జమ్మూకశ్మీర్‌లో ఎన్‌ఐఏ దాడులు..

జాతీయ దర్యాప్తు సంస్థ సోమవారం జమ్మూ కశ్మీర్‌లో సోదాలు నిర్వహించింది. శ్రీనగర్, షోపియాన్ జిల్లాల్లో మూడుచోట్ల ఎన్‌ఐఏ ఈ దాడులు చేపట్టింది. షోపియాన్‌లోని దారుల్ ఉలూమ్ సిరాజుల్ ఉలూమ్ విద్యాసంస్థ లక్ష్యంగా సోదాలు జరిగాయి. చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద గత నెల దానిని అక్రమ సంస్థగా ప్రకటించారు. అందులో సాధారణ విద్యతో పాటు మతపరమైన బోధనలు కూడా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎన్‌ఐఏకి చెందిన మరో బృందం జమాతే ఇస్లామీ మాజీ చీఫ్ షహజాదా ఔరంగజేబు నివాసంలో




తనిఖీలు చేసింది. వేర్పాటువాదాన్ని ప్రోత్సహించే జమాతే ఇస్లామీ పునరుద్ధరణకు యత్నాలపై దర్యాప్తులో భాగంగా ఈ చర్యలు తీసుకుంది. శ్రీనగర్‌లోని లాల్‌బజార్ ప్రాంతంలో ఉన్న జమియత్ ఉల్ బనాత్ పాఠశాలలో కూడా సోదాలు జరిగాయి. అది బాలికలకు మతపరమైన బోధన చేసే స్కూల్. ఈ దాడులకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సిఉంది.

## రాష్ట్రపతి భవన్‌లో ఘనంగా 'పద్మ' అవార్డుల ప్రదానోత్సవం

దిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో 'పద్మ' అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సోమవారం సాయంత్రం ఈ అవార్డులను ప్రదానం చేశారు. బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర (మరణానంతరం)కు పద్మవిభూషణ్ రాగా.. ఈ పురస్కారాన్ని ఆయన సతీమణి, ఎంపీ హేమమాలిని అందుకున్నారు. కళారంగంలో పద్మవిభూషణ్‌ను ఎన్.రాజమ్ అందుకున్నారు. ఉత్తరాఖండ్ మాజీ సీఎం భగత్‌సింగ్ కోశ్యారీ, గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ కల్లిపట్టి రామసామి పళనిస్వామి, కోటక్ మహీంద్రా బ్యాంక్ వ్యవస్థాపకులు ఉదయ్ సురేష్ కుమార్ కోటక్, మహిళా క్రికెట్ జట్టు సారథి హర్మన్ ప్రీత్ కౌర్ తదితరులు ఈ ప్రతిష్ఠాత్మక పౌర పురస్కారాలను అందుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి నేడు పురస్కారాలను అందుకున్నవారిలో గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ (మరణానంతరం), గూడూరు వెంకట్ రావు, పాల్కొండ విజయ్ ఆనంద్ రెడ్డి, వెంపటి కుటుంబ శాస్త్రి, దీపికా రెడ్డి ఉన్నారు.





## నా శరీరంలో మార్పులు చూసి.. ప్లాస్టిక్ సర్జరీ అనుకున్నారు

ఇటీవలే 'అగ్లీ స్టోరీ' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన కథానాయిక అవికా గోర్ ప్లాస్టిక్ సర్జరీలు, కాస్మోటిక్ ట్రీట్‌మెంట్లు చేయించుకుందంటూ సోషల్ మీడియాలో గాసిప్స్ వినిపిస్తున్నాయి. తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఈ రూమర్లపై ఆమె స్పందిస్తూ ఫుల్ క్లారిటీ ఇచ్చింది. తమపై వస్తున్న సర్జరీ వదంతులను అవికా పూర్తిగా తోసిపుచ్చింది. "నేను ముఖంపై ఒక చిన్న ట్రీట్‌మెంట్ తీసుకున్న మాట వాస్తవమే. కానీ, అది అందం కోసం చేయించుకున్న సర్జరీ కాదు.. కేవలం నా ముఖంపై ఉన్న పింపుల్స్ (మొటిమలు) తగ్గించుకోవడానికి మాత్రమే. దురదృష్టవశాత్తూ అది కూడా సరిగా పనిచేయలేదు" అని వెల్లడించింది. నటిగా స్క్రీన్‌పై ప్రెజెంటబుల్‌గా కనిపించడం ముఖ్యం కాబట్టి, అవసరాన్ని బట్టి అప్పుడప్పుడు పార్లర్‌కు వెళ్లి బ్లడ్ సెల్స్ క్లీనింగ్, బైఫిషియల్ లాంటి సాధారణ ఫేషియల్స్ చేయించుకునేదాన్ని తప్ప ఎలాంటి కాస్మోటిక్ సర్జరీలు చేయించుకోలేదని స్పష్టం చేసింది. "నాకు 7 ఏళ్ల వయసున్నప్పటి నుండే మేకప్ వేసుకోవడం అలవాటైంది. నా చర్మాన్ని కాపాడుకోవడానికి సన్‌స్క్రీన్ ఎక్కువగా వాడతాను. అసలు ఒక చిన్న టాటూ వేయించుకోవాలన్నా, కనీసం హెయిర్ కట్ చేయించుకోవాలన్నా మా అమ్మ పర్మిషన్ కావాలి.. అలాంటిది అంత పెద్ద సర్జరీలు నేను ఎలా చేయించుకోగలను?" అని అవికా ఎదురు ప్రశ్నించింది. శరీరంలో వచ్చిన మార్పులు, ఫిట్‌నెస్ గురించి మాట్లాడుతూ.. "నా శరీరతత్వం ఏంటంటే.. చాలా త్వరగా బరువు పెరుగుతాను. అంతే వేగంగా బరువు తగ్గుతాను. వయసు పెరిగే కొద్దీ అమ్మాయిల శరీరంలో సహజంగానే మార్పులు వస్తాయి. కానీ, నన్ను చిన్నప్పటి నుండి చూస్తున్న జనాలు ఆ మార్పులను గమనించి ప్లాస్టిక్ సర్జరీ అనుకుని పొరబడ్డారు" అని చెప్పింది. ఇండస్ట్రీలో సమంత, రష్మిక మందన్నా, పూజా హెగ్డే వంటి స్టార్ హీరోయిన్లు తమ బాడీని ఎంత పర్ఫెక్ట్‌గా మెయింటైన్ చేస్తారో చూసి తాను ఎంతో ఇన్‌స్పైర్ అయ్యానని, వారిలాగే తాను కూడా జిమ్‌లో కఠినమైన వర్కవుట్స్ చేస్తూ సహజంగానే బరువు తగ్గానని అవికా గోర్ క్లారిటీ ఇచ్చింది.

## ఆ ముగ్గురు హీరోల హిట్స్ వెనుక త్రిష



### నెటిజన్ పోస్ట్ షేర్ చేసిన నటి

కోలీవుడ్ అగ్ర హీరోల కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల్లో త్రిష భాగస్వామి కావడంతో ఆమెకు 'లక్కీ ఛార్మ్' అనే పేరు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ విషయాన్ని ఒక అభిమాని పంచుకోగా, త్రిష దానిని తన ఇన్‌స్టాగ్రామ్‌లో రీషేర్ చేశారు.

**రికార్డు సృష్టించిన ఆ మూడు చిత్రాలు:**

- విజయ్ 'లియో': రూ.600 కోట్లకు పైగా వసూళ్లతో విజయ్ కెరీర్ బెస్ట్ చిత్రంగా నిలిచింది.
- అజిత్ కుమార్ 'గుడ్ బ్యాడ్ అగ్లీ': రూ.248 కోట్లకు పైగా వసూలు చేసిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో త్రిష కీలక పాత్ర పోషించారు.
- సూర్య 'కరుప్పు': రూ.300 కోట్ల దిశగా దూసుకెళ్తున్న ఈ చిత్రంలో త్రిష లాయర్ ప్రీతిగా మెప్పించారు.

సినిమా

## ఈ వారం థియేటర్‌లో యాక్షన్.. ఓటీటీలో వినోదం

అర్జున్, అభిరామి, ప్రీతి ముకుందన్ ప్రధాన పాత్రల్లో రూపొందిన సినిమా 'బ్లాస్ట్ జోన్'. సుభాష్ కె.రాజ్ దర్శకత్వం వహించారు. ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ నిర్మించింది. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ మే 28న థియేటర్లలో విడుదల కానుంది. అనుకోని పరిస్థితుల్లో ఓ హెడ్‌మాస్టర్ ఫ్యామిలీ ఆపదలో పడుతుంది. అయితే, కరాటే తెలిసిన ఆ కుటుంబం తమని తాము ఎలా రక్షించుకున్నది అన్న ఆసక్తికర కథాంశంతో ఈ చిత్రాన్ని తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది.




'మరీచిక' సినిమాతో ప్రేక్షకుల్ని థ్రిల్ చేసేందుకు సిద్ధమవుతున్నారు అనుపమ పరమేశ్వరన్, రెజీనా. వీళ్లిద్దరూ... విరాజ్ అశ్విన్ ప్రధాన పాత్రధారులుగా నటించిన ఈ చిత్రాన్ని సతీశ్ కాశెట్టి తెరకెక్కించారు. రాజీవ్ చిలక, మేఘా చిలక నిర్మించారు. అజయ్ ఘోష్ కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా ఈనెల 29న విడుదల కానుంది. వెంకట లక్ష్మి అనే పల్లెటూరి అమ్మాయి, సంజు అనే సిటీ కుర్రాడి మధ్య బంధం బలపడుతుండగా.. మరీచిక అనే ఎన్నారై రావడంతో ఆ ముగ్గురి జీవితాల్లో చోటు చేసుకున్న పరిణామాలేంటనే ఆసక్తికర కథాంశంతో ఈ సినిమాను తీర్చిదిద్దారు.




*** ఓటీటీలోనూ వినోదమే.. సినిమాలు/వెబ్‌సిరీస్‌లివే!**

కమెడియన్ సత్య హీరోగా దర్శకుడు రితేశ్ రానా తెరకెక్కించిన చిత్రం 'జెట్లీ'. వెన్నెల కిశోర్, శ్రీనివాస్ రెడ్డి, వైవా హర్ష, అజయ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. రియా సింఘా కథానాయిక. ప్రస్తుతం ఈ చిత్రం 'జియో హాట్‌స్టార్' వేదికగా వినోదాన్ని పంచుతోంది.



ధనుష్, మమితాబైజు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కర'. యాక్షన్ థ్రిల్లర్‌గా ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. మే 28 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది. విఘ్నేశ్ రాజా దర్శకత్వం వహించిన ఈ సినిమాలో కె.ఎస్. రవికుమార్, పృథ్వీరాజన్ కీలక పాత్రల్లో కనిపించారు.




**జియో హాట్‌స్టార్**

**బ్రదర్స్ అండ్ సిస్టర్స్ (వెబ్‌సిరీస్) తమిళ్ మే 27**

**నెట్‌ఫ్లిక్స్**

షరీఫ్ లాబర్డర్ (మూవీ) ఇంగ్లీష్‌లో స్ట్రీమింగ్ అవుతోంది

మై2 సెంట్స్ (మూవీ ఇంగ్లీష్ మే 27

రఫా: సీజన్1 (వెబ్‌సిరీస్) ఇంగ్లీష్ మే 29

## ఆయనతో యాక్టింగ్.. నా జన్మధన్యమైంది: రామ్‌చరణ్

బెంగళూరులో 'పెద్ది' టీమ్ సందడి చేసింది. జూన్ 4న సినిమా విడుదల కానున్న సందర్భంగా సోమవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో రామ్‌చరణ్, జాన్వీకపూర్, శివ రాజ్‌కుమార్, నిర్మాత సతీశ్ కిలారు తదితరులు పాల్గొన్నారు. రామ్‌చరణ్ మాట్లాడుతూ.. ''నాకు నచ్చిన పని చేస్తూ మీ అందరి ప్రేమ పొందుతున్నందుకు భగవంతుడికి, మీకు ధన్యవాదాలు. రెండున్నరేళ్ల విరామం తర్వాత 'పెద్ది'తో మళ్లీ తెరపైకి వస్తున్నా. ప్రాణం పెట్టి మరీ ఈ చిత్రంలో నటించా. రాసిపెట్టుకోండి.. ఈ సినిమా ది బెస్ట్ అవుతుంది. శివన్న (శివ రాజ్‌కుమార్) తండ్రిలాంటి వారు. ఇండియన్ సినిమా లెజెండ్ ఆయన. కన్నడ చిత్ర పరిశ్రమ చక్రవర్తి. ఆయనతో కలిసి పని చేయడంతో నా జన్మధన్యమైంది. మా కాంబినేషన్ (జాన్వీ కపూర్‌ని ఉద్దేశించి)ను ఎంతో మంది అభిమానులు కోరుకున్నారు. జాన్వీతో కలిసి నటించడం ఆనందంగా ఉంది. అంకితభావంతో పని చేశారు. దర్శకుడు బుచ్చిబాబు లేనిదే ఈ సినిమా లేదు. ఈ చిత్రం విషయంలో మరో కీలక వ్యక్తి డైరెక్టర్ సుకుమార్. స్ఫూర్తినింపే చిత్రమిది'' అని పేర్కొన్నారు. బుచ్చిబాబు.. సుకుమార్ శిష్యుడనే సంగతి తెలిసిందే. ఈ సినిమా సమర్పకుల్లో సుకుమార్ ఒకరు.




*** పవన్- చరణ్ అనుబంధం హత్తుకుంది: శివ రాజ్‌కుమార్**

''నిజాయతీ, కష్టపడేతత్వం రామ్ చరణ్‌ను ఈ స్థాయికి చేర్చాయి. చిరంజీవి, పవన్ కల్యాణ్‌ల ఆశీస్సులు చరణ్ వెంటే ఉంటాయి. ఓ సినిమా ఈవెంట్‌లో చరణ్ ఆయన బాబాయ్ పవన్ మధ్య అనుబంధం నా హృదయాన్ని హత్తుకుంది. ఆ దృశ్యాలు చూడగానే పునీత్ రాజ్‌కుమార్‌తో నాకున్న అనుబంధం గుర్తొచ్చింది. 'పెద్ది' టీమ్ ప్రేమను మర్చిపోలేను. ఈ సినిమాలో స్పోర్ట్స్ మాత్రమే కాదు ఎమోషన్ కూడా ఉంది'' అని శివ రాజ్‌కుమార్ అన్నారు.

## రణ్‌వీర్ సింగ్‌పై ఫిల్మ్ ఫెడరేషన్ కీలక నిర్ణయం

బాలీవుడ్ ప్రముఖ నటుడు రణ్‌వీర్ సింగ్ ఓ తీవ్ర వివాదంలో చిక్కుకున్నారు. ప్రతిష్టాత్మక 'డాన్ 3' సినిమా నుంచి ఆయన ఆఖరి నిమిషంలో తప్పుకోవడంతో ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయిస్ (ఎఫ్ డబ్ల్యూఐసీఈ) ఆయనపై సహాయ నిరాకరణ ఆదేశాలు జారీ చేసింది. దీని ప్రకారం ఫెడరేషన్‌కు చెందిన ఏ సభ్యుడు కూడా రణ్‌వీర్‌తో కలిసి పనిచేయకూడదు. సినిమా చిత్రీకరణ ప్రారంభం కావడానికి కొద్ది రోజుల ముందు రణ్‌వీర్ ఈ ప్రాజెక్ట్ నుంచి వైదొలిగారు. దర్శకుడు ఫర్హాన్ అక్తర్ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనుల్లో సుమారు రూ.45 కోట్ల నష్టం జరిగిందని ఫెడరేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో వివరణ ఇవ్వాలని రణ్‌వీర్‌ను ఫెడరేషన్ కోరగా, ఇది తమ వ్యక్తిగత ఒప్పందమని, దీనికి ఫెడరేషన్ వేదిక కాదని రణ్‌వీర్ వర్గం తిరస్కరించింది. దీంతో రణ్‌వీర్‌పై ఫెడరేషన్ సహాయ నిరాకరణ ఆదేశాలు జారీ చేసింది. అయితే, రూ.10 కోట్ల అడ్వాన్స్ వెనక్కి ఇచ్చేస్తానని, తన తర్వాతి సినిమా 'ప్రళయ్'లో వాటా ఇస్తానని రణ్‌వీర్ ఆఫర్ చేసినట్లు వస్తున్న వార్తలను నిర్మాణ సంస్థ ఖండించింది.



ప్రస్తుతం సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవడానికి సిద్ధంగా ఉన్నామని ఫెడరేషన్ పేర్కొంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.